

TGTEL/25/A1713

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 145 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | శుక్రవారం 24 జూలై 2026 | వెల : 4/-




## ప్రపంచ అనిశ్చితుల మధ్యా భారత్ బలంగా ముందుకు సాగుతోంది

- వేగంగా ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటన్న ఆర్‌బీఐ
- జూన్ వరకు ఆర్థిక కార్యకలాపాలు బలంగా కొనసాగినట్లు వెల్లడి



## సిలిండర్‌పై రూ.700కుపైగా సబ్సిడీ!

- పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై క్లారిటీ ఇవ్వని కేంద్రం
- అంతర్జాతీయ ధరలు పెరిగినా రూ.942కే గృహ ఎల్పీజీ సిలిండర్
- 14.2 కిలోల సిలిండర్‌పై జూన్‌లో రూ.700కు పైగా పరోక్ష సబ్సిడీ

## సర్ పేరుతో కేంద్రంలోని

# బీజేపీ కుట్ర



- గ్రామాల్లో దళితులు, గిరిజనుల ఓట్లు తొలగించేందుకు ప్రయత్నం
- ఓటు పోతే సంక్షేమ పథకాలకు కూడా ఇబ్బందులు
- ఎస్ఐఆర్‌కు ఆద్యుడు కేసీఆరే.. మీడియాతో సీఎం చిట్‌చాట్
- జన్వాడ ఫామ్‌హౌస్ ఏ రాజుది?
- ఏ రాజుకు గ్లోబరీనా సంస్థతో సంబంధం?
- నీట్ పేపర్ లీకేజీకి స్ఫూర్తి 'కో ఎంప్ట్'గా పేరు మార్చుకున్న నాటి గ్లోబరీనా సంస్థ

హైదరాబాద్

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్-సర్) పేరుతో కాంగ్రెస్ ఓటు బ్యాంక్‌ను లక్ష్యంగా చేసుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేసిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 'సర్' పేరుకే ప్రక్షాళన అని, కాంగ్రెస్ ఓట్ల తొలగింపే టార్గెట్ అని ధ్వజమెత్తారు. గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా దళితులు, గిరిజనుల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటు కోల్పోతే సంక్షేమ పథకాల లబ్ధి పొందడంలో కూడా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అన్నారు. గతంలో కేసీఆర్ హయాంలో జీహెచ్ఎంసీ కమిషనర్ సోమేశ్‌కుమార్ నగరంలో - మిగతా3లో



## రైతులు వరి సాగుపై పునరాలోచించాలి

- తెలంగాణలో ఎల్-నినోపై మంత్రి కీలక ప్రకటన
- వచ్చే నెలల్లోనూ ఎల్-నినో ప్రభావం కొనసాగుతుంది..
- 23 జిల్లాల్లో లోటు వర్షపాతం.. బోరుబావుల కింద కూడా వరి సాగు చేయవద్దు
- విత్తనాలు, రుణాలు, డ్రిప్ పరికరాలు ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశం
- ఎల్-నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి

## హిట్లర్ పుట్టిన ఇల్లు ఇకపై పోలీస్ స్టేషన్

- నియో-నాజీలకు యాత్రాస్థలంగా మారకుండా నిరోధించడమే లక్ష్యం
- 20 మిలియన్ యూరోల భారీ వ్యయంతో భవనం పునరుద్ధరణ
- ప్రభుత్వ నిర్ణయంపై మిశ్రమ స్పందనలు, హక్కుల సంఘాల విమర్శలు
- చరిత్రను మరుగునపరిచే ప్రయత్నమంటూ పలువురి ఆరోపణ








# హిట్లర్ పుట్టిన ఇల్లు ఇకపై పోలీస్ స్టేషన్



జర్మన్ నియంత, లక్షలాది మంది మరణానికి కారణమైన అడాల్ఫ్ హిట్లర్ పుట్టిన ఇంటిని ఆస్ట్రియా ప్రభుత్వం పోలీస్ స్టేషన్‌గా మార్చింది. నయా–నాజీలకు, తీవ్రవాద భావజాలం ఉన్నవారికి ఈ భవనం ఒక పుణ్యక్షేత్రంగా మారకుండా నిరోధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘకాలం పాటు కొనసాగిన వివాదాలకు ముగింపు పలుకుతూ, పునరుద్ధరించిన ఈ భవనాన్ని జూలై 22న అధికారికంగా ప్రారంభించారు. ఆస్ట్రియాలోని బ్రానో అమ్ ఇన్ పట్టణంలో, జర్మనీ సరిహద్దుకు సమీపంలో ఉన్న ఈ ఇంట్లో హిట్లర్ 1889లో జన్మించాడు. అయితే, అతను ఇక్కడ కొద్ది కాలం మాత్రమే నివసించాడు. నాజీల పాలనలో ఈ భవనాన్ని ఒక స్మారక చిహ్నంగా, ఆర్ట్ మ్యూజియంగా మార్చారు. నాజీల పతనం తర్వాత, ఈ భవనం నయా–నాజీలకు ఆకర్షణ కేంద్రంగా మారింది. ఏటా హిట్లర్ పుట్టినరోజున ఇక్కడికి వచ్చి నివాళులర్పించడం వివాదాలకు దారితీసింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం, ఆస్ట్రియా ప్రభుత్వం 2017లో ఈ భవనాన్ని చట్టపరంగా బలవంతంగా స్వాధీనం చేసుకుంది. అనంతరం, సుమారు 20 మిలియన్ యూరోలకు పైగా భారీ వ్యయంతో దీనిని పునరుద్ధరించి, పోలీస్ స్టేషన్‌గా మార్చింది. భవనం ముందు ఇప్పుడు కేవలం 'పోలీస్' అనే బోర్డు మాత్రమే కనిపిస్తుంది. హిట్లర్‌కు సంబంధించిన ఎలాంటి ఆనవాళ్లు లేకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. అయితే, భవనం బయట గతంలోనే ఏర్పాటు చేసిన 'మరోసారి ఫాసిజం వద్దు' అని రాసి ఉన్న స్మారక శిలను మాత్రం అలాగే ఉంచారు. ప్రభుత్వ నిర్ణయంపై స్థానిక అధికారులు, ప్రజల నుంచి ఎక్కువగా మద్దతు లభిస్తోంది. దీనివల్ల ఈ ప్రాంతంలో వివాదాలు సమసిపోతాయని, ప్రశాంతత నెలకొంటుందని వారు ఆశిస్తున్నారు. అయితే, ఈ నిర్ణయంపై విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. హోలోకాస్ట్ (యూదులపై సాగించిన దారుణ మారణహోమం) బాధితుల సంఘమైన 'మౌతాసెన్ కమిటీ' వంటి సంస్థలు ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. చరిత్రను గుర్తుచేసుకుని, భవిష్యత్ తరాలకు దాని తీవ్రతను తెలియజేయడానికి బదులుగా, దానిని పూర్తిగా మరుగునపరిచే ప్రయత్నం జరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌కు బదులుగా ఈ భవనాన్ని ఒక చారిత్రక మ్యూజియం లేదా విద్యా కేంద్రంగా మార్చి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ చర్య ద్వారా, వివాదాస్పద చారిత్రక ప్రదేశాలను రోజువారీ వినియోగంలోకి తేవడం ద్వారా వాటి ప్రాధాన్యతను తగ్గించాలన్న ఆస్ట్రియా వ్యూహం స్పష్టమవుతోంది.

# జంతర్ మంతర్‌కు వేలాది మంది.. ఇది వాంగ్‌చుక్, దిప్కే వల్ల కాదు

**న్యూఢిల్లీ:** జంతర్ మంతర్ వద్ద గత కొన్ని వారాలుగా కొనసాగుతున్న నిరసనలకు వేలాది మంది తరలివస్తున్నారు. ఈ ఆందోళనలకు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే నేతృత్వం వహిస్తుండగా, లడఖ్‌కు చెందిన పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరవధిక నిరాహారదీక్ష చేపట్టడంతో ఈ ఉద్యమానికి జాతీయ స్థాయిలో ప్రాధాన్యం లభించింది. అయితే, ఇంతమంది జనం స్వచ్ఛందంగా తరలివస్తుండటానికి అసలు కారణం ఈ ఇద్దరు నేతల ఆకర్షణ మాత్రమే కాదని, 2026 నీట్ యూజీ పేపర్ లీక్, సీబీఎస్ఈ ఆన్–స్క్రీన్ మార్కింగ్ అవకతవకల పట్ల విద్యార్థులు, తల్లిదండ్రుల్లో పేరుకుపోయిన తీవ్ర ఆగ్రహమేనని క్షేత్రస్థాయి పరిశీలనలు చెబుతున్నాయి. పరీక్ష ఒత్తిడితో తోబుట్టువులను, స్నేహితులను కోల్పోయిన అనేకమంది యువకులు, పాఠశాల విద్యార్థులు సైతం తల్లిదండ్రులకు తెలియకుండా ఇక్కడికి చేరుకుంటున్నారు.



జంతర్ మంతర్‌కు ఇప్పుడు వేలాదిగా చేరుతున్న వారిని నడిపిస్తున్నది ఒక్క నాయకుడు కాదని విశ్లేషకులు చెబుతున్నారు. లాఠీచార్జి, బాష్పవాయు ప్రయోగం తర్వాత విద్యార్థులు, యువతలో ఆగ్రహం మరింత పెరిగిందని అంటున్నారు. అదే దేశం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఢిల్లీకి రావడానికి కారణమైందని పేర్కొంటున్నారు. అందుకే ఈ ఉద్యమం వ్యక్తుల చుట్టూ కాకుండా ప్రజల ఆవేదన చుట్టూ విస్తరిస్తోందని వివరిస్తున్నారు.

**ఇలా మొదలైంది**

సీజేపీ ఆధ్వర్యంలో స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఏఐఎస్ఏ వంటి విద్యార్థి సంఘాలు 2026 జూన్ 6 నుంచి జంతర్ మంతర్ వద్ద నిరసనలు కొనసాగిస్తున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, పేపర్ లీక్ కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని, శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం ఆపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జూన్ 28న వాంగ్‌చుక్ దీక్ష ప్రారంభించగా, జులై మధ్యలో బారికేడ్లు తొలగించి, ఆయనను బలవంతంగా ఆసుపత్రికి తరలించడం, దిప్కేపై సిరా దాడి ఘటన మీడియా దృష్టిని మరింత పెంచాయి.

జులై 20న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజు 'సంసద్ చలో' పేరిట వేలాది మంది నిరసనకారులు పార్లమెంట్ వైపు కవాతు చేపట్టగా, భద్రతా బారికేడ్లను దాటే యత్నం చేయడంతో పోలీసులు లాఠీచార్జి, బాష్పవాయువు ప్రయోగించారు. ఈ ఘర్షణల్లో నిరసనకారులు, పోలీసులు స్వల్పంగా గాయపడగా, 10–15 మందిని అదుపులోకి తీసుకున్నట్టు వర్గాలు తెలిపాయి. అయితే పోలీసులు ఎలాంటి బలప్రయోగం చేయలేదని అధికారులు తెలిపారు. రాజకీయ పార్టీలు, ప్రతిపక్ష నేతలు ఈ ఉద్యమానికి మద్దతు ప్రకటిస్తుండగా, ప్రభుత్వం మాత్రం ఈ నిరసనలు పరీక్షల సమస్యలకు మించి రాజకీయ లక్ష్యాలతో సాగుతున్నాయని ఆరోపిస్తోంది. రానున్న రోజుల్లో ప్రభుత్వ స్పందన, వాంగ్‌చుక్ ఆరోగ్య పరిస్థితి, మరిన్ని విద్యార్థి బృందాల భాగస్వామ్యంపైనే ఈ ఉద్యమ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**సామాన్యుల ఆగ్రహమే కారణం**

నీట్ పేపర్ లీక్, పరీక్షల అవకతవకల వల్ల జీవితాలు నాశనమైన సాధారణ విద్యార్థులు, కుటుంబాలే ఈ జనప్రవాహానికి నిజమైన కారణం. నాయకుల పిలుపు కంటే మించి, వ్యవస్థపై నమ్మకం కోల్పోయిన సామాన్యుల ఆగ్రహమే ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తోందని విశ్లేషకులు అంటున్నారు.

# 'సిలిండర్‌పై రూ.700కుపైగా సబ్సిడీ!'

అంతర్జాతీయ మార్కెట్‌లో ఎల్పీజీ ధరలు భారీగా పెరిగినా, దేశీయ వినియోగదారులపై భారం పడకుండా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్‌పై రూ.700కు పైగా పరోక్ష సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపింది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయ ఎల్పీజీ ధరలు పెరిగినప్పటికీ, దేశంలో 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధరను అందుబాటులో ఉంచినట్లు పేర్కొంది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం దేశీయ ఎల్పీజీ సిలిండర్ రిటైల్ ధర రూ.942గా కొనసాగుతోందని తెలిపారు. అయితే జూన్ 2026లో ఒక్కో సిలిండర్‌పై రూ.700కు పైగా పరోక్ష సబ్సిడీ ఉందని వివరించారు. జూలై నెలలో కూడా ఒక్కో సిలిండర్‌పై రూ.500కు పైగా పరోక్ష సబ్సిడీ కొనసాగుతోందని చెప్పారు.

**అంతర్జాతీయ ధరలు పెరిగినా ధర నియంత్రణ**

పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచ మార్కెట్‌లో ఎల్పీజీ ధరలు ఒక్కసారిగా పెరిగాయని కేంద్రం తెలిపింది. ఎల్పీజీ ధరల నిర్ణయంలో కీలకమైన సౌదీ కాంట్రాక్ట్ ప్రైస్ (సౌదీ సీపీ) ఏప్రిల్, మే నెలల్లో మెట్రిక్ టన్నుకు 780 డాలర్లకు చేరిందని జూన్‌లో 796 డాలర్లకు పెరిగిందని పేర్కొంది. ఆ అంతర్జాతీయ ధరల ప్రకారం దేశీయ మార్కెట్‌లో 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.1,695 వరకు చేరుకునే అవకాశం ఉందని కేంద్రం అంచనా వేసింది. అయితే వినియోగదారులపై ఆ భారం పడకుండా ప్రభుత్వం ధరలను నియంత్రిస్తోందని తెలిపింది.

**ఉజ్వల లబ్ధిదారులకు మరింత ప్రయోజనం!**

ప్రధానమంత్రి ఉజ్వల యోజన కింద ఉన్న 10.5 కోట్ల మందికిపైగా వినియోగదారులకు మరింత ప్రయోజనం అందుతోందని కేంద్రం తెలిపింది. దిల్లీలో ఉజ్వల లబ్ధిదారులు ఒక్కో సిలిండర్‌కు కేవలం రూ.642 మాత్రమే చెల్లిస్తున్నారని పేర్కొంది. ఇందులో కేంద్రం అందిస్తున్న రూ.300 లక్ష్యిత సబ్సిడీతో పాటు రూ.500కు పైగా పరోక్ష సబ్సిడీ కూడా ఉంటుందని వివరించింది. అంతర్జాతీయ ధరల ప్రభావం నేరుగా వినియోగదారులపై పడకుండా ప్రభుత్వం భరిస్తోందని తెలిపింది.

**సరఫరాలో అంతరాయం లేదు!**

పశ్చిమాసియాలో సంక్షోభం సమయంలో హార్ముజ్ జలసంధి మూసివేత వంటి పరిణామాలు ఎల్పీజీ సరఫరాపై ప్రభావం చూపే అవకాశం ఉందని కేంద్రం తెలిపింది. భారత్ తన ఎల్పీజీ అవసరాల్లో గతంలో దాదాపు 60 శాతం దిగుమతులపై ఆధారపడేదని పేర్కొంది. ఈ దిగుమతుల్లో దాదాపు 90 శాతం హర్మూజ్ జలసంధి మార్గం ద్వారా వచ్చేవని వివరించింది. అయితే సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు దేశీయ ఉత్పత్తిని పెంచినట్లు తెలిపింది. రోజుకు 34 టీఎంటీగా ఉన్న దేశీయ ఎల్పీజీ ఉత్పత్తిని 54 టీఎంటీకి పెంచినట్లు వెల్లడించింది. అంతేకాకుండా దిగుమతుల వనరులను విస్తరించడం, నిల్వలను సమర్థంగా నిర్వహించడం, ప్రాంతాల మధ్య సరఫరాలను సర్దుబాటు చేయడం వంటి చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. మార్చి నుంచి జూన్ 2026 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా 56 కోట్లకు పైగా గృహ ఎల్పీజీ సిలిండర్లు సరఫరా చేశామని, అందులో 12 కోట్లకు పైగా ఉజ్వల కుటుంబాలకు అందించినట్లు కేంద్రం తెలిపింది.

**ఎల్పీజీ కోసం వేల కోట్ల భారం**

దేశీయ ఎల్పీజీ ధరలను నియంత్రించేందుకు చమురు మార్కెటింగ్ కంపెనీలకు ప్రభుత్వం భారీగా నిధులు అందిస్తోందని వెల్లడించింది. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.22 వేల కోట్లు చెల్లించగా.. 2025–26, 2026–27 ఆర్థిక సంవత్సరాల్లో కలిపి రూ.30 వేల కోట్లు చెల్లిస్తున్నట్లు తెలిపింది. అయితే ప్రభుత్వ రంగ చమురు సంస్థలు దేశీయ ఎల్పీజీ విక్రయాల్లో ఎదుర్కొంటున్న నష్టాలు కూడా భారీగానే ఉన్నాయని పేర్కొంది. జూన్ 30, 2026 నాటికి ఈ నష్టాలు రూ.51 వేల కోట్లకు పైగా ఉన్నట్లు వివరించింది.

**పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపుపై స్పష్టత లేదు**

మరోవైపు అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తారా అనే ప్రశ్నకు కేంద్రం స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు ఇంకా అస్థిరంగానే ఉన్నాయని తెలిపింది. బ్రెంట్ క్రూడ్ ధర ఏప్రిల్ 30న బ్యారెల్‌కు 122.86 డాలర్లుగా ఉండగా, జూలై 2న 68.17 డాలర్లకు తగ్గిందని కేంద్రం వెల్లడించింది. అయితే జూలై 21న మళ్లీ 92.19 డాలర్లకు పెరిగిందని తెలిపింది. భారత్ తన అవసరాల్లో 88 శాతానికి పైగా ముడిచమురును దిగుమతి చేసుకుంటుందని, పశ్చిమాసియా సంక్షోభం కారణంగా మార్చి నుంచి అంతర్జాతీయ ధరలు పెరిగాయని కేంద్రం పేర్కొంది. వినియోగదారులపై భారం తగ్గించేందుకు మార్చి 2026లో పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.10 చొప్పున తగ్గించినట్లు తెలిపింది. దీనివల్ల ప్రభుత్వ ఆదాయంపై ప్రభావం పడిందని వివరించింది.

## డీఆర్‌డీఓ మరో ఘనత..

రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) మరో కీలక విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. సుదూర లక్ష్యాలను ఛేదించగల 'కుశ' క్షిపణి (ఎం–ఎస్ఏఎం) తొలి ప్రయోగాన్ని గురువారం విజయవంతంగా నిర్వహించింది. ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్ కలాం ఐలాండ్ నుంచి ఈ పరీక్షను చేపట్టినట్లు డీఆర్‌డీఓ వర్గాలు వెల్లడించాయి. గగనతలంలో అత్యంత వేగంగా, ఎత్తులో ప్రయాణించే ఎలక్ట్రానిక్ లక్ష్యాన్ని అనుకరించి ఈ పరీక్ష నిర్వహించగా, 'కుశ' క్షిపణి దానిని విజయవంతంగా అడ్డగించిందని డీఆర్‌డీఓ ఒక ప్రకటనలో తెలిపింది. యుద్ధ విమానాలు, క్షిపణులు, మానవరహిత వైమానిక వాహనాలు (యూఏవీ), శత్రువులకు చెందిన భారీ విమానాలను కూడా సుదూరంలోనే నాశనం చేయగల సత్తా ఈ క్షిపణి వ్యవస్థకు ఉంది.

'ప్రాజెక్ట్ కుశ'లో భాగంగా భారత వాయుసేన, నౌకాదళం కోసం ఈ క్షిపణి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 80 కిలోమీటర్ల రేంజ్ ఎంఆర్–శామ్, 400 కిలోమీటర్ల రేంజ్ ఎస్–400 వ్యవస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని 'కుశ' భర్తీ చేయనుంది. ఇప్పటికే వాయు రక్షణ వ్యవస్థలో ఉన్న బరాక్–8, ఎస్–400, ఆకాశ్ క్షిపణులకు ఇది అదనపు బలంగా నిలవనుంది. 'కుశ' క్షిపణి విజయవంతం కావడం భారత రక్షణ పరిశోధన రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇలాంటి అత్యాధునిక క్షిపణి వ్యవస్థలను అభివృద్ధి చేయగల సామర్థ్యం కేవలం కొన్ని దేశాలకే ఉందని గుర్తుచేశారు. ఈ విజయంతో ఇలాంటి వ్యవస్థల కోసం విదేశాలపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుందని, ఇది దేశ వాయు రక్షణ సామర్థ్యంలో ఒక పెద్ద ముందడుగు అని ఆయన పేర్కొన్నారు. ఈ క్షిపణికి సంబంధించిన రాడార్లు, కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సహా అన్ని భాగాలను డీఆర్‌డీఓ, దేశీయ పరిశ్రమలు కలిసి అభివృద్ధి చేశాయి. రక్షణ శాఖ కార్యదర్శి, డీఆర్‌డీఓ ఛైర్మన్ రాజేష్ కుమార్ సింగ్ ఈ ప్రయోగాన్ని పర్యవేక్షించి, శాస్త్రవేత్తల బృందాన్ని అభినందించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై తగ్గేదేలే



పరీక్షా పత్రాల లీకేజీల వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని, ఈ డిమాండ్‌పై ఎలాంటి చర్చలకు, రాజీకి తావులేదని 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రతినిధులు చర్చలు జరపాలనుకుంటే, నిరసన జరుగుతున్న జంతర్ మంతర్ వద్దకే రావాలని స్పష్టం చేసింది. ఈ మేరకు గురువారం సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే మీడియాతో మాట్లాడారు. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు మా నిరసన కొనసాగుతుంది. ఈ విషయంలో వెనక్కి తగ్గేది లేదు. అదే సమయంలో, సోనమ్ వాంగ్‌చుక్ గారు తన ప్రాణాలను పణంగా పెట్టడం మాకు ఇష్టం లేదు. దేశానికి ఆయన సేవలు ఎంతో అవసరం కాబట్టి, ఆయన తన ఆమరణ నిరాహార దీక్షను విరమించాలని కోరుతున్నాం" అని డిప్కే విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం గురుగ్రామ్‌లోని మేదాంత ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాంగ్‌చుక్ దీక్ష గురువారం నాటికి 26వ రోజుకు చేరుకుంది. కేంద్ర మంత్రులతో చర్చల విషయంపై డిప్కే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "కేంద్ర మంత్రి జేపీ నడ్డా నివాసంలో చర్చల పేరుతో మమ్మల్ని ఐదు గంటల పాటు ఎదురుచూసేలా చేశారు. కేవలం 10 నిమిషాలు మాత్రమే మాట్లాడారు. ఇది సమయాన్ని వృథా చేయడమే. ఒకవైపు మమ్మల్ని చర్చలకు పిలుస్తూనే, మరోవైపు విద్యార్థులపై దారుణంగా దాడులు చేయించారు. ఇకపై ప్రభుత్వం ఏమైనా మాట్లాడాలనుకుంటే, తదుపరి సమావేశం జంతర్ మంతర్‌లోనే జరగాలి" అని ఆయన అన్నారు. ఈ ఆందోళనను రాజకీయం చేస్తున్నారన్న నడ్డా వ్యాఖ్యలపై స్పందిస్తూ.. "ఆయనకు రాజకీయాలు అంతగా నచ్చకపోతే, పదవి నుంచి తప్పుకోవచ్చు కదా? ఎన్నికల ర్యాలీలు, ఓట్లు అడిగేది వారు. మేము విద్యార్థులకు న్యాయం చేయాలని మాత్రమే కోరుతున్నాం" అని డిప్కే బదులిచ్చారు. సీజేపీ జాతీయ అధికార ప్రతినిధి అశుతోశ్ రంకా మాట్లాడుతూ.. "ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మా ప్రధాన డిమాండ్. దానిపై చర్చల్లేవు. వ్యవస్థలో పైనుంచి కింది వరకు అసమర్థులు, అవినీతిపరులు తిష్ట వేయడం వల్లే పేపర్ లీకులు జరుగుతున్నాయి. వీరందరి పైన ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు ఈ సమస్యకు పరిష్కారం లభించదు" అని తీవ్రంగా విమర్శించారు. ఈ ఉద్యమం తమ హక్కుల కోసం పోరాడేలా ఓ తరాన్ని ప్రేరేపించిందని, ఇదే తమ అతిపెద్ద విజయమని ఆయన పేర్కొన్నారు.

## పేపర్ లీకేజీలపై ఉక్కుపాదం



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీకేజీ కేసుల్లో నిందితులకు కఠిన శిక్షలు పడేలా, వేగంగా న్యాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేసింది. ఈ మేరకు ఫాస్ట్–ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన గంటల వ్యవధిలోనే ఈ ప్రక్రియను మొదలుపెట్టింది. నీట్ పేపర్ లీకేజీ కేసులో నిందితులను కొత్తగా తీసుకొచ్చిన 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) యాక్ట్–2024' కింద విచారించనున్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చట్టం కింద దోషులుగా తేలిన వారికి గరిష్ఠంగా 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ కేసుల విచారణ కోసం తొలి దశలో నాలుగు రాష్ట్రాల్లో ఫాస్ట్–ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు కేంద్రం సిద్ధమవుతోంది. బాంబే, కలకత్తా, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల పరిధిలో ఈ ప్రత్యేక కోర్టులు పనిచేయనున్నాయి. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న నాలుగు కేసులను ఈ ఫాస్ట్–ట్రాక్ కోర్టులకు బదిలీ చేయనున్నారు. నీట్ పేపర్ లీక్‌కు సంబంధించి ఈ కొత్త చట్టం కింద ఇప్పటికే నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటిలో రెండు కేసులు బాంబే హైకోర్టు పరిధిలోకి వస్తాయి. ఈ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్–ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలను, హైకోర్టులను కేంద్రం అధికారికంగా కోరనుంది. రోజువారీ విచారణ జరిపి, కేసులను త్వరగా పరిష్కరించాలని ఈ అభ్యర్థనలో పేర్కొననుంది. నీట్‌తో పాటు యూపీఎస్సీ, ఎస్ఎస్సీ, ఆర్ఆర్‌బీ, ఐబీపీఎస్ వంటి ఇతర పోటీ పరీక్షలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించిన పేపర్ లీకేజీలు కూడా ఈ కొత్త చట్టం పరిధిలోకి వస్తాయని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. అంతకుముందు ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. యువత భవిష్యత్తు, సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని స్పష్టం చేశారు. "యువత భవిష్యత్తును దెబ్బతీయాలని ప్రయత్నించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. దోషులకు కఠిన శిక్షలు పడేలా ఫాస్ట్–ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# సర్ పేరుతో కేంద్రంలోని బీజేపీ కుట్ర

-మొదటిపేజీ తరువాయి

లక్షల ఓట్లు తొలగించారని, ఎన్నికల కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయనను సంక్షేమ శాఖకు బదిలీ చేశారని విమర్శించారు. ఇప్పుడు చేస్తున్న ఎస్ఐఆర్‌కు ఆద్యుడు కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. గురువారం శాసనసభ ఆవరణలో జరుగుతున్న మరమ్మతు పనులను సీఎం పరిశీలించారు. అనంతరం అసెంబ్లీ మీడి యా అడ్వైజరీ కమిటీ కార్యాలయంలో విలేకరులతో చిట్‌చాట్ చేశారు.

**ముందు ఓట్ల తొలగింపు.. తర్వాత సంక్షేమ పథకాలు**

'పేదోడి ఓటు చాలా విలువైంది. ఓటు పోతే వారి జీవితం పోతుంది. అందుకే 3వ తేదీ వరకు మా నేతలకు హైదరాబాద్ రావొద్దని చెప్పా. సర్ ప్రక్రియ ఇప్పటివరకు 70 శాతం పూర్తయ్యింది. ఇంకా 30 శాతం ఉంది.. ఇదే కీలకం. ఎస్ఐఆర్ ప్రక్రియలో బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) అత్యంత కీలక పాత్ర పోషించాలి. గ్రామీణ ప్రాంతాల్లో ముస్లింలు, దళితులు, గిరిజనుల ఓట్లు పెద్దఎత్తున తొలగిపోయే ప్రమాదం ఉంది. కూలీ పనులకు వెళ్లేవారు, పనుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే పేదలంతా దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల వాళ్లే. బీఎల్ఓలు వచ్చినప్పుడు వాళ్లు ఇంట్లో లేకపోతే ఆ ఓట్లు పోయినట్టే. కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకుగా ఉన్న ఈ వర్గాల ఓట్లను తొలగించడం ద్వారా పార్టీని బలహీనపరచాలని కుట్ర జరుగుతోంది. ఓటు లేకపోతే ప్రజాస్వామ్య హక్కులు పోవడంతో పాటు సంక్షేమ పథకాల అమలులో కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

**నాకు రెండు ఓట్లు లేవు..**

'కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పరస్పరం సహకరించుకుంటున్నాయి. నీట్ పేపర్ లీకేజీ నుంచి ఎస్ఐఆర్ వరకు రెండు పార్టీల వైఖరి అనుమానాలకు తావిస్తోంది. వాస్తవాలు త్వరలోనే బయటపడతాయి. చట్టానికి ఎవరూ అతీతులు కారు. నాకు రెండు ఓట్లు ఉంటే బీఆర్ఎస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేయాలి. విచారణ చేసి తప్పు అయితే లోపల వేస్తారు. నేను స్వయంగా ఎన్నికల కమిషన్‌కు దరఖాస్తు పెట్టుకుని ఓటు కొడంగల్‌కు మార్చుకున్నా.

**కాళేశ్వరం కేసులో సీబీఐ తన పని చేసుకుంటుంది..**

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అక్రమాలపై సీబీఐ దర్యాప్తు కొనసాగిస్తుంది. ఎన్డీఎస్ఏ, పీసీ ఘోష్ కమిటీ నివేదికల ఆధారంగానే సీబీఐకి దర్యాప్తుకు అప్పగించాం. తప్పు చేసి ఉంటే తప్పించుకోలేరు. మేడిగడ్డ బరాజ్ గేట్లు తెరిచినా, పంప్‌హౌస్‌లు నడిచేపక్షంలో అవెందుకు కట్టారో చెప్పకుండా హరీశ్‌రావు చావు తెలివితేటలు ప్రదర్శిస్తున్నారు. మేడిగడ్డ, కన్నెపల్లి పంప్‌హౌస్, బరాజ్‌ల నిర్మాణం, గేట్ల నిర్వహణపై నిపుణుల నివేదికలు స్పష్టంగా ఉన్నాయి. ఆ అంశాలపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడకుండా కన్నెపల్లి నుంచి నీటిని తరలించాలని కొత్త రాగం అందుకున్నారు. మేడిగడ్డ బరాజ్‌లో 5 టీఎంసీల నీళ్లు ఉన్నప్పుడే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని తరలించే అవకాశం ఉంది. అదే పద్ధతి అన్నారం, సుందిళ్లలో కూడా ఉంది. ఇవన్నీ జరగాలంటే మూడు బరాజ్‌ల గేట్లు మూయాలి. అవి మూస్తే బరాజ్ కూలుతుందని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసింది. దేవాదుల ప్రాజెక్టులో అన్ని పంపులు పనిచేస్తున్నాయి..' అని రేవంత్ వివరించారు.

**జన్వాడ ఫామ్‌హౌస్ ఎవరిది?**

'ఇంటర్మీడియెట్ పరీక్షల వ్యవహారంలో 25 మంది విద్యార్థుల మరణాలకు కారణమైందని ఆరోపణలు ఎదుర్కొన్న గ్లోబ్ అరెనా సంస్థ పేరు మార్చుకుని ప్రస్తుతం 'కో ఎంప్ట్' గా చలామణి అవుతోంది. నీట్ పేపర్ లీకేజీకి స్ఫూర్తి నాటి గ్లోబ్ అరెనా సంస్థ చేసిన ఇంటర్ లీకేజీనే. జన్వాడ ఫామ్‌హౌస్ ఏ రాజు నుంచి వచ్చిందో...ఆ ఫామ్‌హౌస్‌కు, గ్లోబ్ అరెనా సంస్థ 'రాజు'కు ఉన్న సంబంధమేంటో కేటీఆర్ చెప్పాలి. గ్లోబ్ అరెనా సంస్థ తనది కాదని కేటీఆర్ చెప్పే పక్షంలో పోలీసులకు ఫిర్యాదు చేయాలి. వెంటనే పూర్తి స్థాయి విచారణ జరిపిస్తాం. ఇప్పటికే విజిలెన్స్ ద్వారా గ్లోబ్ అరెనా ఇంటర్ లీకేజీపై విచారణ జరుగుతోంది. కేటీఆర్ ఫిర్యాదు చేస్తే సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగుతారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిన వారి విషయంలో ప్రభుత్వం రాజీ పడదు. బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవు. జైలుకు వెళ్తే సానుభూతి వచ్చి సీఎంలు అయ్యే పక్షంలో, ఎప్పుడో జైల్లో ఉన్న చార్లెస్ శోభరాజ్, బిల్లా రంగాలు కూడా పీఎంలు అయ్యే వాళ్లు..' అని సీఎం వ్యాఖ్యానించారు.

**'ఇందిరమ్మ' అదనపు ఖర్చు లబ్ధిదారులదే**

'పేదల ఇళ్లకు రూ.5 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టింది. అందుకు అనుగుణంగానే భూమి ఉన్నవారు నిర్మించుకునే ఇళ్లకు ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తుంది. హైదరాబాద్‌లో ఇచ్చే లక్ష ఇళ్లకు కూడా ప్రభుత్వం రూ.5 లక్షలు ఇస్తుంది. అదనపు ఖర్చు లబ్ధిదారులే చెల్లించాల్సి ఉంటుంది.

**సమర్థవంతంగా హైడ్రా వ్యవస్థ**

హైడ్రా వ్యవస్థ సమర్థవంతంగా పనిచేస్తోంది. చెరువులను పునరుద్ధరించి ప్రభుత్వ భూములను కాపాడుతోంది. ఉద్యోగాల భర్తీలో మా ప్రభుత్వం రికార్డు సృష్టించింది. 55 రోజుల్లో 11 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశాం. అసెంబ్లీలో ప్రశ్న అడిగితే నియామకాల జాబితాను పేర్లతో సహా వెల్లడించడానికి సిద్ధం. నోటిఫికేషన్ ఇవ్వడం, ప్రశ్నపత్రం అమ్ముకోవడం వారి విధానమైతే, నోటిఫికేషన్లు ఇచ్చి నియామక పత్రాలు ఇవ్వడం మా విధానం. టీఎస్‌పీఎస్‌సీని ప్రక్షాళన చేయలేకపోయామని కేటీఆర్ ఒప్పుకున్నాడు. మేము ప్రక్షాళన చేయడమే కాకుండా పదేళ్ల తర్వాత గ్రూప్ --1 పరీక్షలు నిర్వహించాం..' అని ముఖ్యమంత్రి అన్నారు.

# తెలంగాణలో విద్యాసంస్థలు బంద్?!

## పలు యూనివర్సిటీ పరిధిలో పరీక్షలు వాయిదా




తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం పలు విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. నీట్ పేపర్ లీకేజీ దోషులను శిక్షించడంతోపాటు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్? రాజీనామా చేయాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో పలు పలు యూనివర్సిటీలు రేపు జరగాల్సిన పరీక్షలు వాయిదా వేశాయి.

**త్వరలో కొత్త తేదీని ప్రకటిస్తాం**

ఈ నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ), శాతవాహన యూనివర్సిటీ (ఎస్‌యూ), జేఎన్‌టీయూ, తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ), కాళోజీ ఆరోగ్య వర్సిటీ పరిధిలో నిర్వహించే పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు ఆయా వర్సిటీలు ప్రకటించాయి. అనుబంధ కళాశాలల్లో జరగాల్సిన అన్ని పరీక్షలను వాయిదా వేస్తున్నామని, త్వరలో కొత్త తేదీని ప్రకటిస్తామని ఓయూ, జేఎన్‌టీయూ, ఎస్?యూ, టీయూ, కాళోజీ ఆరోగ్య వర్సిటీ తెలిపాయి. ఈ మేరకు అనుబంధ కళాశాలలకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించాయి.

**ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు మూతపడే అవకాశం**

మరోవైపు పలు విద్యా సంస్థల యాజమాన్యాలు పాఠశాలలు, కాలేజీలకు సెలవు ప్రకటించాయి. ఇప్పటికే కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు సెలవుకు సంబంధించిన సమాచారాన్ని తల్లిదండ్రుల మొబైల్ ఫోన్లకు సందేశాల ద్వారా తెలియజేస్తున్నాయి. బంద్ కారణంగా రాష్ట్రంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు రేపు మూతపడే అవకాశం ఉంది.

**కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలి**

ఈ 24న జరిగే రాష్ట్రవ్యాప్త బంద్‌ను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎఫ్‌డీఎస్, ఏఐఎస్‌బీ, ఏఐపీఎస్‌యూ సంఘాలు ప్రకటనలో కోరాయి. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాసంస్థల నిర్వాహకులు, ఉపాధ్యాయులు సహకరించాలని విజ్ఞప్తి చేశాయి. దేశ విద్యావ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు.

**పెద్ద ఎత్తున నిరసనలు**

నీట్ పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. మే నెలలో జరిగిన ఈ పరీక్షలో భారీ ఎత్తున అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీ జరిగినట్లు తేలడంతో విద్యార్థులు, విపక్షాలు, సామాజిక శ్రేణులు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతున్నారు.

# బాల మేధావులు భళా!

## పాఠశాల ఎన్నిక కోసం ఏకంగా ఈవీఎం తయారీ

ఆ విద్యార్థులు చదువుతున్నది కేవలం ఐదోతరగతే. కానీ వారి ఆలోచనలు మాత్రం ఐదు డిగ్రీలు చదివారేమో అన్నట్టుగా ఉన్నాయి. సాంకేతికతను సద్వినియోగం చేసుకుని కృత్రిమ మేధను తమ ఉపాధ్యాయుల్లో ఒకరిగా చేర్చుకుని ఏఐతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాన్ని రూపొందించారు. ఆ చిచ్చర పిడుగులు తయారుచేసిన ఆ యంత్రాన్ని చూస్తే ఎవర్రా వీళ్లు ఇంతా టాలెంటెడ్‌గా ఉన్నారు అని అనకమానరు. ఆ బాలమేధావులు సృష్టించిన ఓటింగ్ యంత్రాన్ని చూడాలంటే సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి సెయింట్ జోసెఫ్ పాఠశాలకు మనమూ వెళ్లాల్సిందే.

**పాఠశాల ఎన్నిక కోసం ఓటింగ్ యంత్రం**

పాఠశాలలో విద్యాబోధనతో పాటు ప్రపంచంతో పోటీపడే విధంగా నూతన సంస్కరణలను నేర్చుకుంటున్నారీ విద్యార్థులు. ఐదో తరగతి చదువుతున్న ఈ బాలల బృందం వినూత్నంగా పాఠశాల మంత్రివర్గ ఎన్నికల కోసం ఎలక్ట్రానిక్ ఓట్‌ంగ్ యంత్రాన్ని తయారుచేశారు. సికింద్రాబాద్ తిరుమలగిరి సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగించుకుని ఈ ఓటింగ్ మెషీన్‌ను రూపొందించారు. రానున్న పోటీ ప్రపంచానికి మేధావులను తయారుచేసేలా నిర్మాణాత్మక కార్యకలాపాలకు శ్రీకారం చుట్టారీ చిన్నారులు. ఎన్నికల ఓటింగ్ యంత్రాన్ని తయారుచేయడంతో పాటు తమ పాఠశాలలోని ఆరు నుంచి పదో తరగతి వరకు ఉన్నత విలువలతో కూడిన విద్యార్థి నాయకులను ఎన్నుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



"ప్రపంచ వ్యాప్తంగా ఏఐ, రోబోటిక్స్ వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో మా పాఠశాల ఎన్నికల ఓటింగ్ కోసం ఈ ఈవీఎంను రూపొందించాం. విద్యార్థులమంతా గ్రూప్‌గా ఏర్పడి దీనిని తయారు చేశాం. ఈ యంత్రంపై కొన్ని స్విచ్?లను అమర్చాం. వాటిపై అభ్యర్థుల పేర్లు ఉంటాయి. ఓటు వేసేందుకు లిమిట్? స్విచ్?పై ప్రెస్? చేయాల్సి ఉంటుంది. అప్పుడు ఓ బజర్? మోగుతుంది. సంబంధిత డేటా ఇంటర్నెట్ ద్వారా గూగుల్ షీట్లలో నిక్షిప్తమవుతుంది. మాకు ఇంత మంచి అవకాశం కల్పించినందుకు పాఠశాల యాజమాన్యానికి ధన్యవాదాలు"– విద్యార్థులు

హర్షం వ్యక్తం చేసిన పాఠశాల యాజమాన్యం : విద్యార్థులు తమ నైపుణ్యాలతో మరోసారి ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మైకేల్ డిసౌజా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కృత్రిమ మేధను ఈ ఓటింగ్ మెషీన్‌లో ఉపయోగించడం ఎంతో గర్వకారమని దీని ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యత, ప్రజాస్వామ్య విలువలను మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే గొప్ప ఆవిష్కరణలు చేయడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులతో పాటు పలువురు ఈ చిన్నారులను ప్రశంసిస్తున్నారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటే ప్రతి ఒక్కరూ అద్భుతాలు సృష్టించవచ్చని సెయింట్ జోసెఫ్ స్కూల్ విద్యార్థులు నిరూపిస్తున్నారు.

"మా పాఠశాల విద్యార్థులు సొంతంగా ఈవీఎం యంత్రాలు తయారు చేసి స్కూల్ కేబినెట్ ఎన్నికలకు సిద్ధమవ్వడం నిజంగా గర్వకారణంగా ఉంది. విద్యార్థులు చేసిన ఈ వినూత్న ఆలోచన నాకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. వారు రూపొందించిన ఈవీఎం యంత్రం ద్వారా తమ కేబినెట్ నాయకుడిని ఎన్నుకుని ప్రజాస్వామ్యం అనే భావనను అర్థం చేసుకున్నందుకు నేను సంతోషిస్తున్నాను. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల ప్రజాస్వామ్య స్ఫూర్తిని పెంపొందించడానికి కృషి చేస్తున్నాం"– మైకేల్ డిసౌజా, ప్రధానోపాధ్యాయుడు

## రైతులు వరి సాగుపై పునరాలోచించాలి

**హైదరాబాద్:** సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల వారీగా ఎల్–నినో కంటింజెన్సీ ప్రణాళికపై ఇంచార్జి మంత్రుల ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాలు నిర్వహించినట్లు వ్యవసాయ, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ రోజు (గురువారం) సచివాలయంలో జిల్లాల వారీగా వచ్చిన సూచనలు, ప్రస్తుత ఎల్–నినో పరిస్థితులు, రానున్న నెలల్లో తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ల ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భారత వాతావరణ శాఖ నివేదిక ప్రకారం వచ్చే నెలలో కూడా ఎల్–నినో పరిస్థితులు కొనసాగనున్నాయని, సెప్టెంబర్ నాటికి దాని తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, డిసెంబర్ నాటికి తీవ్రమైన పరిస్థితులు ఏర్పడే సూచనలు ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్‌తో పాటు రబీ సీజన్‌పై కూడా దీని ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున ఇప్పటి నుంచే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహారాష్ట్ర, కర్ణాటక వంటి ఎగువ రాష్ట్రాల్లో కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు నమోదు కాకపోవడంతో అక్కడి నుంచి గోదావరి, కృష్ణా నదులకు పెద్దఎత్తున వరదలు వచ్చే అవకాశాలు కనిపించడం లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 23 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని, ఒకటి రెండు జిల్లాలు మినహా ఎక్కడా సాధారణ వర్షపాతం నమోదు కాలేదని తెలిపారు. గత రెండు రోజులుగా అక్కడక్కడ కురుస్తున్న వర్షాలను చూసి రైతులు వరి సాగు చేయాలని నిర్ణయించుకోవద్దని స్పష్టం చేశారు. భూగర్భ జలాలు కూడా వేగంగా తగ్గిపోతున్నాయని, బోరుబావుల కింద కూడా వరి సాగు చేయవద్దని రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. మేజర్, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో ఉన్న నీరు ప్రధానంగా తాగునీటి అవసరాలకే సరిపోయే పరిస్థితి ఉందని, ప్రతి జిల్లాలోని ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వ సామర్థ్యంపై మండలాల వారీగా రైతులకు నిరంతరం సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొంతమంది రైతులు ఇంకా వర్షాలు పడతాయనే ఆశతో వరి సాగు చేయాలని భావిస్తున్నారని, వారికి వాస్తవ పరిస్థితులను పూర్తిగా వివరించి ఎలాంటి నష్టాలు జరగకుండా అవగాహన కల్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. గత వర్షాకాలంతో పోలిస్తే ఈ సీజన్‌లో దాదాపు 23 శాతం మేర సాగు విస్తీర్ణం తగ్గే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించిన విధంగానే ప్రతి మండలానికి, ప్రతి గ్రామానికి కూడా ప్రత్యేక అధికారులను నియమించే అంశంపై కలెక్టర్లతో చర్చించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు మంత్రి సూచించారు. ఈ అధికారులు స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామ స్థాయిలో రైతులందరికీ ఎల్–నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటలు, నీటి లభ్యత, ప్రభుత్వ సూచనలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొని ఆయా జిల్లాల పరిస్థితులకు అనుగుణంగా పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఆ సూచనలన్నింటినీ సమగ్రంగా పరిశీలించి రాష్ట్రస్థాయి కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ముఖ్యమంత్రి గారికి అందజేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు,ఎక్స్పర్ట్ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి కె. సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి, సహకార శాఖ కమిషనర్ రాహుల్ రాజ్, హార్టికల్చర్ ఎండీ యాస్మిన్ బాషా, కర్నాటి వరుణ్ రెడ్డి, భారత వాతావరణ శాఖ , ఇక్రిశాట్, క్రిడా, ఐఐఎంఆర్, ఎస్.ఎల్.బి.సి, నాబార్డు, నేషనల్ సీడ్ కార్పొరేషన్ తదితర సంస్థల అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## బీజేపీ పతనానికి నాంది

-మొదటిపేజీ తరువాయి

హన్మకొండలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరైన కేటీఆర్ మీడియా ప్రతినిథులతో చిట్ చాట్?లో పలు అంశాలపై మాట్లాడారు. దేశ రాజధానిలో యువత చేస్తున్న ఉద్యమం తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేస్తుందని కేటీఆర్? తెలిపారు. నాయకుడు లేకుండానే యువత స్ఫూర్తివంతమైన ఉద్యమం చేస్తుందన్నారు. దిల్లీ ఉద్యమంతో మోదీ ప్రభుత్వం అతిపెద్ద సవాల్ ఎదుర్కొంటోందన్న కేటీఆర్ బీజేపీ ప్రభుత్వం ఎవరితో పెట్టుకోకూడదో వారితోనే పెట్టుకుందని తెలిపారు. మోదీపై యువత తీవ్ర వ్యతిరేకత, అసహనంతో ఉన్నారని అన్నారు. బీజేపీ పతనానికి నాంది పడిందని మోదీని దేవుడు అన్నోళ్లే తిరుగుబాటు చేస్తున్నారని అభిప్రాయపడ్డారు.


**పగలు కాంగ్రెస్, రాత్రి బీజేపీతో సీఎం రేవంత్‌రెడ్డి**

దేశంలోనే దిక్కు లేకుండా పోయేపరిస్థితి బీజేపీకి ఎదురవుతోందని, ఇక తెలంగాణలో అధికారంలోకి వచ్చే పరిస్థితి ఎక్కడుందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మోదీపై మాట్లాడే దమ్ము ఎక్కడుందని నిలదీశారు. తోటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు దిల్లీ వెళ్లి మోదీ ఇంటిముందు ధర్నా చేస్తే రేవంత్ రెడ్డి కనీసం రాజ్ భవన్ ముందు కూడా ఆందోళన చేయకుండా కొడంగల్?లో చేశారని విమర్శించారు. రేవంత్ రెడ్డి పగలు కాంగ్రెస్ తో రాత్రి బీజేపీతో ఉంటాడని, బీజేపీ ఎంపీల కార్లలో వెళ్లి రేవంత్ రెడ్డి అమిత్ షాతో సమావేశాల్లో పాల్గొంటున్నాడని ఆరోపించారు. రేవంత్ రెడ్డి దిల్లీ కాంగ్రెస్?కి ఒక మూట ఇస్తే బీజేపీకి రెండు మూటలు పంపుతున్నాడని విమర్శించారు.

**ఏ పార్టీతో పొత్తు ఉండదు**

వచ్చే ఏడాది తన పాదయాత్ర ఉంటుందన్న కేటీఆర్ ఏ పార్టీతోనూ పొత్తు ఉండబోదని స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో మళ్లీ కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కేసీఆర్?ను సీఎం చేయడమే తన ఎజెండా అన్నారు. సీఎం పదవి వారసత్వ హక్కు కాదని, తనకు ఎలాంటి భ్రమలు లేవన్నారు. ఈ సారి రైతులు, యువత, మహిళలను తమవైపు ఆకర్షించేలా పార్టీ కార్యాచరణ ఉంటుందని ఆగస్టు 10 తర్వాత పార్టీ సంస్థాగత బలోపేతం చేపడతామన్నారు.

## మొబైల్ రికవరీలో తెలంగాణలో మొదటి స్థానం ఆ జిల్లాదే?



ప్రస్తుతం ఈ డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరికీ జీవితంలో సెల్‌ఫోన్ ముఖ్య పాత్ర పోషిస్తుంది. అలాంటిది చోరీకి గురైతే ఆ మనోవేదన అంతాఇంతా కాదు. ఖరీదు విషయం పక్కన పెడితే షార్ట్ ఫిల్మ్స్, విలువైన సమాచారం విషయంలో బాధితుల ఆందోళన అంతాఇంతా కాదు. అతి సున్నితమైన సమాచారం బయటకు వచ్చే అవకాశాలు లేకపోలేదు. గతంలో అయితే సాంకేతికత లేమి కారణంగా వెతకడం పోలీసులకు తలనొప్పిగా ఉండేది. కేంద్రం తీసుకొచ్చిన సీఈఐఆర్? విధానంతో రికవరీ సులభతరంగా మారింది. మొబైల్ ఫోన్ల రికవరీలో 76.8 శాతంతో రాష్ట్రంలో రాజన్న సిరిసిల్ల జిల్లా వరుసగా మూడోసారి మొదటి స్థానంలో నిలిచింది. ఇటీవలే రూ.13 లక్షల విలువైన 90 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందజేశారు.

**టెక్నికల్ సాయంతో ఫిర్యాదు**

మొబైల్ పోయిన వెంటనే చాలా మంది తిరిగి దొరకదనే భావనతో పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెనకాడుతుంటారు. అయితే సీఈఐఆర్ పోర్టల్ అందుబాటులో వచ్చినప్పటి నుంచి పరిస్థితి మారింది. ఎవరిదైనా ఫోన్ పోయినా, చోరీకి గురైన దాని ఐఎంఈఐ నంబర్?తో పాటు ఎప్పుడు, ఎక్కడ పోయింది సెల్?ఫోన్? కంపెనీ పేరు, తదితర వివరాలను సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్? (సీఈఐఆర్?) పోర్టల్?లో నమోదు చేస్తారు. సిమ్ బ్లాక్ చేస్తారు. అందులో కొత్త సిమ్? వేసి వినియోగించినప్పుడు ఆ సెల్‌ఫోన్‌ను గుర్తించే అవకాశం ఉంటుంది. ఈ విధానాన్ని సమర్థంగా వినియోగిస్తున్న సిరిసిల్ల జిల్లా పోలీసులు వందలాది మొబైళ్లను రికవరీ చేసి బాధితులకు అందజేస్తున్నారు.

**దాదాపు 2,531 ఫోన్ల గుర్తింపు**

పోగొట్టుకున్న ఫోన్ల రికవరీలో జిల్లా పోలీసులు రాష్ట్రంలోనే ముందంజలో ఉన్నారు. నాలుగేళ్లలో సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదుల మేరకు సాంకేతిక నైపుణ్యంలో ఇప్పటివరకు 2,531 ఫోన్లను గుర్తించి యజమానులకు అందజేశారు. 76.8 శాతం రికవరీ చేశారు. దీంతో బాధితుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పోలీసుల సేవలకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# సంపాదకీయం

## బీజేపీ గేమ్‌లో సీజేపీ

ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వెలుపల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన ధర్నా, ఆందోళన సందర్భంగా ఆయన గాయపడటం జాతీయ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా మీడియా దృష్టిని ఆకర్షించడమే కాకుండా, అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయి వాగ్వాదానికి కారణమైంది. అయితే,పైకి కనిపించే ఈ రాజకీయ నిరసన వెనుక అత్యంత సంక్లిష్టమైన వ్యూహాత్మక రాజకీయ కోణం ఉందనే చర్చ ఇప్పుడు రాజకీయ పరిశీలకుల్లో జోరుగా సాగుతోంది.ప్రస్తుతం దేశంలో తీవ్రరూపం దాల్చుతున్న సిజెపి ఆందోళనలు, కాక్రోచ్‌ల ఉద్యమం వంటి తీవ్రమైన ప్రజా ఆగ్రహ ఉద్వేగాలను పక్కదారి పట్టించడానికి లేదా వాటి ఉధృతిని తగ్గించడానికి ఈ ధర్నా ఒక సేఫ్టీ వాల్వ్‌లా ఉపయోగపడిందనే వాదన ప్రధానంగా వినిపిస్తోంది. ప్రజా సమస్యలపై జరుగుతున్న ఈ ఉగ్ర పోరాటాల తీవ్రతను కప్పిపుచ్చేందుకు, ప్రజల మరియు మీడియా దృష్టిని పూర్తిగా రాహుల్ గాంధీ చేపట్టిన నిరసన వైపు మళ్లించేందుకు ఇదొక చక్కటి వ్యూహంగా అమలు చేశారని భావిస్తున్నారు. తీవ్రమైన ప్రజా వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకు ఇలాంటి నాటకీయ పరిణామాలు దోహదపడతాయని భావిస్తున్నారు. ఈ పరిణామం ద్వారా అధికార పక్షానికి ఒక రకమైన వ్యూహాత్మక ప్రయోజనం చేకూరినట్లు కనిపిస్తోంది. సున్నితమైన ఉద్యమాల నుంచి దృష్టిని వేరే వైపు మళ్లించేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ ధర్నా ఒక కంట్రోల్డ్ ఆపోజిషన్ వ్యూహంలో భాగమనే అనుమానాలు బలపడుతున్నాయి. రాహుల్ గాంధీకి తగినంత స్పేస్ ఇవ్వడం ద్వారా అసలు సమస్యల మూలాలను తెరవెనుకకు నెట్టి, కేవలం వ్యక్తిగత లేదా పార్టీ కేంద్రీకృత అంశాలపై చర్చ జరిగేలా చూడటంలో బీజేపీ వ్యూహం సఫలమైందనే చెప్పాలి.రాహుల్ గాంధీకి ఈ స్థాయిలో నిరసన తెలిపేందుకు, మీడియాలో భారీ స్పేస్ ఆక్రమించేందుకు అధికార బీజేపీయే వ్యూహాత్మకంగా అవకాశం కల్పించిందనే అనుమానాలు బలంగా వినిపిస్తున్నాయి. రాజకీయాల్లో ఏదీ యాదృచ్ఛికంగా జరగదనే నానుడికి తగినట్లుగా, కాంగ్రెస్ అగ్రనేతను ఒక పావులా వాడుకుని పెద్ద ఎత్తున ప్రజా దృష్టిని వేరే అంశాల వైపు మళ్లించే ప్రయత్నం జరిగిందన్న భావన వ్యక్తమవుతోంది. రాహుల్ గాంధీ నేతృత్వంలోని ఈ హై-వోల్టేజ్ ఆందోళనను అధికార పక్షం తమకు అనుకూలమైన ఒక వ్యూహాత్మక ఆయుధంగా మలచుకుందనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో బలపడుతున్నాయిమీడియా దృష్టిని పూర్తిగా మోదీ నివాస ఆందోళన , రాహుల్ గాంధీ గాయం చుట్టూ కేంద్రీకరించడం ద్వారా, దేశవ్యాప్తంగా ఊపందుకుంటున్న ఇతర ప్రజా ఉద్యమాల వేగం ఆకస్మికంగా నెమ్మదించింది. మీడియాలో ప్రధాన హెడ్‌లైన్స్ అన్నీ రాహుల్ ధర్నా గురించే రావడంతో, కాక్రోచ్‌ల ఉద్యమం, సిజెపి ఆందోళనల తీవ్రత కొంతమేర కిందికి దిగివచ్చింది. ఇది అధికార పార్టీకి వ్యూహాత్మకంగా అతిపెద్ద ఊరటనిచ్చే అంశంగా రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ మొత్తం వ్యూహంలో కాంగ్రెస్ పార్టీ తాము ఒక పెద్ద పోరాటం చేశామని భావిస్తున్నప్పటికీ, వాస్తవానికి అది అధికార పార్టీ వ్యూహంలో భాగస్వామ్యం కావడమేనని విమర్శకులు ఎత్తిచూపుతున్నారు. బీజేపీ సర్కార్‌ను ఇరుకున పెట్టాలని భావించిన రాహుల్ గాంధీకి స్పేస్ దక్కినప్పటికీ, దానివల్ల అసలు ప్రజా సమస్యల తీవ్రత నీరుగారిపోయింది. ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాల నుంచి దృష్టిని మళ్లించే డెకాయ్ రాజకీయాలకు కాంగ్రెస్ మరోసారి బలయ్యిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని నివాసం వెలుపల రాహుల్ గాంధీ చేసిన ధర్నా , ఆ సందర్భంగా జరిగిన పరిణామాలు కేవలం ఒక సాధారణ నిరసన ప్రదర్శన మాత్రమే కాదని, ఇదొక పెద్ద రాజకీయ మైండ్ గేమ్‌గా స్పష్టమవుతోంది. తీవ్రమైన ప్రజా ఉద్యమాలను నీరుగార్చేందుకు అధికార పక్షం అందించిన సేఫ్టీ వాల్వ్ స్పేస్‌ను కాంగ్రెస్ వాడుకోవడం ద్వారా, తాత్కాలిక రాజకీయ లబ్ధి పొందినట్లు కనిపించినా దీర్ఘకాలికంగా మాత్రం క్షేత్రస్థాయి ఉద్యమాల తీవ్రత దెబ్బతిన్నదనేది ఎక్కువ మంది భావన.

# హ్యాట్రిక్ కోసం యోగీ వ్యూహాలు



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో అధికారం చేజిక్కించుకోవడం దేశవ్యాప్తంగా పాలనా అధికారం కోసం పోటీపడే ఏ పార్టీకైనా అత్యంత కీలకమైన మెట్టు. ఈ రాష్ట్రం 80 లోక్‌సభ స్థానాలతో దేశంలోనే అత్యధిక ప్రాతినిధ్యం కలిగి ఉంది. పశ్చిమ భారతదేశం మొత్తం కలిపినా ఇంతకంటే తక్కువ స్థానాలు ఉంటాయి. తూర్పు భారతదేశం సీట్ల సంఖ్యతో యూపీ సమానంగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో 2027 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మూడోసారి అధికారం నిలబెట్టుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. యోగి ఆదిత్యనాథ్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలనే ప్రయత్నంలో పార్టీ ఇప్పటి నుంచే గ్రాస్‌రూట్స్ స్థాయిలో వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది.2019లో బీజేపీ యూపీలో 62 సీట్లు గెలవగా, 2024లో కేవలం 33 సీట్లకు పరిమితమైంది. ఈ భారీ పతనం పార్టీని ఆత్మపరిశీలనకు దారితీసింది. 400 సీట్ల టార్గెట్‌ను చేరుకోలేకపోవడం వెనుక యూపీలోని నష్టాలు ప్రధాన కారణం. ఇకపై కులం, మతం ఆధారంగా కాకుండా పనితీరు, పాలనా ఫలితాల ఆధారంగా ఓటర్లను ఆకర్షించాలని బీజేపీ నిర్ణయించింది. ఈ మార్పు యోగి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు, అభివద్ధి పనులు, చట్టవ్యవస్థ బలోపేతం వంటి అంశాలను ప్రజల ముందు పెట్టడం ద్వారా విశ్వాసం పెంచే దిశగా ఉంది.బీజేపీ 18 జిల్లాల్లోని 64 అసెంబ్లీ స్థానాలను 'స్వింగ్ సీట్లు'గా గుర్తించి, వాటిపై ప్రత్యేక వ్యూహం రూపొందించింది. ఇక్కడ 2014, 2019, 2024 ఎన్నికల్లో ఓట్ల శాతం, ఇతర పార్టీల పనితీరు వివరంగా విశ్లేషించబడుతోంది. ఈ సీట్లలో బీజేపీ 10 వేల ఓట్లలోపు మెజారిటీతో ఓడిపోయినట్లు గుర్తించింది. ఇవి త్వరగా తిరిగి సాధించగల స్థానాలుగా భావిస్తోంది. పార్టీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి, సంఘటన మంత్రి ధరమ్‌పాల్ సింగ్ ఈ 64 సీట్లను నేరుగా పర్యవేక్షిస్తున్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లను నియమించి, వారిని ఎన్నికల వరకు అక్కడే ఉంచి క్షేత్రస్థాయి పని చేయించే ప్రణాళిక సిద్ధం చేసింది. ఇది వనరులను సమర్థవంతంగా వినియోగించి, లక్ష్య సాధనకు సహాయపడే విధానం.హరియాణా, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ అమలు చేసిన వ్యూహాల నుంచి యూపీకి పాఠాలు నేర్చుకుంది. బెంగాల్‌లో మమతా బెనర్జీ పాలనలో కూడా బీజేపీ 14 దళాలతో సంస్థాగతంగా బలపడింది. 44 ముస్లిం మెజారిటీ నియోజకవర్గాల్లోనూ, మిగతా ప్రాంతాల్లోనూ చిన్న చిన్న సమావేశాలు నిర్వహించి, వాలంటీర్లను నియమించి గ్రాస్‌రూట్స్ స్థాయిలో పని చేసింది. ఇదే తరహా విధానాన్ని యూపీలో కూడా అమలు చేస్తోంది. ఇప్పటికే యూపీలో 15 వేల గ్రూపులు ఏర్పాటు చేసి, ఒక్కో గ్రూపు రోజుకు 30 సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక వేసింది. ఎన్నికల నాటికి ఐదు లక్షల సమావేశాలు జరిపి, ప్రజాభిప్రాయాన్ని తన వైపుకు మళ్లించాలని లక్ష్యం. ఈ సమావేశాల ద్వారా పార్టీ పాలనా ఫలితాలు, యోగి ప్రభుత్వం చేసిన పనులు నేరుగా ఓటర్లకు చేరవేయడం, అనుమానాలు నివృత్తి చేయడం సాధ్యమవుతుంది.ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే 40 లక్షల కుటుంబాలను వ్యక్తిగతంగా కలిసి, వారి సమస్యలు విని, పార్టీ, ఎమ్మెల్యేలపై ఉన్న అసంతప్తిని తొలగించే ప్రయత్నం జరుగుతోంది. ఇది కేవలం ప్రచారం కాదు, నిజమైన అభిప్రాయ సేకరణ మరియు సమస్య పరిష్కార విధానం. 64 స్వింగ్ సీట్ల పరిధిలోని అసెంబ్లీ స్థానాల్లో ఈ పని మరింత తీవ్రంగా జరగనుంది. ఈ విధానం ద్వారా బీజేపీ 'పాలనా పనితీరు'ను ప్రధాన అంశంగా ముందుకు తెచ్చి, సాంప్రదాయకంగా జరిగే ఓటు బ్యాంకు రాజకీయాలను అధిగమించాలని చూస్తోంది.బీజేపీ వ్యూహం రెండు ముఖ్యమైన అంశాలపై ఆధారపడి ఉంది. ఒకటి ? లక్ష్య సాధన. 64 స్వింగ్ సీట్లపై దృష్టి పెట్టడం వల్ల వనరులు వృథా కాకుండా, ఫలితాలు త్వరగా రావచ్చు. రెండు ? గ్రాస్‌రూట్స్ సంస్థాగతీకరణ. ఇతర రాష్ట్రాల్లో విజయవంతమైన మోడల్‌ను అనుసరించడం వల్ల అనుభవం ఉంది. అయితే సవాళ్లు కూడా ఉన్నాయి. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు బీజేపీని ఆపడానికి కలిసి పని చేయవచ్చు. యోగి ప్రభుత్వం చేసిన పనులను ఓటర్లు ఎంతవరకు గుర్తిస్తారు, స్థానిక అసంతృప్తులు ఎంతవరకు తొలగుతాయి అనేది నిజమైన పరీక్ష.మొత్తంమీద బీజేపీ ఇప్పటి నుంచే సమగ్రమైన, క్షేత్రస్థాయి కేంద్రిత వ్యూహంతో ముందుకు సాగుతోంది. 2027లో యోగి ఆదిత్యనాథ్ మూడోసారి సీఎంగా రావాలంటే ఈ స్వింగ్ సీట్లు, గ్రాస్‌రూట్స్ కార్యక్రమాలు నిర్ణయాత్మకంగా మారే అవకాశం ఉంది.

# ఆందోళనలతో ఢిల్లీ...



**న్యూఢిల్లీ :** ఢిల్లీ నగరం ఆందోళనలతో అట్టుడికి పోతుంది. గతంలో కేంద్రం వ్యవసాయ చట్టాలను తీసుకువచ్చింది. అప్పుడు హర్యానా, పంజాబ్ రాష్ట్రాలకు సంబంధించిన కొంతమంది రైతులు అందులో పాల్గొన్నారు. ఇదే అదునుగా ఖలీస్థానీ వేర్పాటు వాదులు అందులోకి ప్రవేశించారు. సరిగ్గా గణతంత్ర దినోత్సవం జరిగిన తర్వాత ఎర్రకోట మీద ఖలీస్థానీ జెండా ఎగరవేశా. దీంతో ఈ రైతు ఉద్యమం వెనుక ఉన్న అజెండా ఏమిటో అందరికీ అర్థమైంది. ఇదే సమయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వెంటనే ఆ చట్టాలను ఉపసంహరించుకున్నట్టు ప్రకటించారు. తద్వారా యూపీ ఎన్నికల్లో విపక్ష పార్టీలు ఊహించని విధంగా స్కెచ్ వేశారు. దీంతో ఆ ఎన్నికల్లో బిజెపి విజయం సాధించింది. మనదేశంలో ఉద్యమాల వెనుక ఉన్న శక్తులు ఎలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయో నాడు ఈ సంఘటన బయటకు తెలిసేలా చేసింది.ఇప్పుడు ఢిల్లీలో కొంతమంది ఉద్యమాలు చేస్తున్నారు. నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. నీటి పేపర్ లీకేజీ.. విద్యార్థుల ఆత్మహత్యలు వంటిఘటనలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఇటీవల సోనం వాంగ్ చుక్ నిరధిక నిరాహార దీక్షకు దిగారు. ఆ తర్వాత ఆయన దీక్షను ప్రభుత్వం విరమింపజేసింది. ఆయన ఢిల్లీలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సరిగా నిన్న ఢిల్లీలో విద్యార్థులు నిరసనలు చేపట్టారు. చలో పార్లమెంట్ నినాదంతో ఢిల్లీ నగరంలో హడావిడి చేశారు. పోలీసులు తమ లాఠీలకు పని చెప్పడంతో అక్కడ హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో కిసాన్ ఘాట్ వద్ద రైతులు నిరసన తెలపడం మొదలుపెట్టారు. వేల సంఖ్యలో ఢిల్లీకి చేరుకున్నారు. భారత్ ? అమెరికా వాణిజప్పంలో భాగంగా తక్కువ ధరకు.. రాయితీతో కూడిన అమెరికా వ్యవసాయ ఉత్పత్తులకు భారత మార్కెట్లను తెరవడాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. అందువల్లే శంభు బార్డర్ (పంజాబ్, హర్యానా సరిహద్దు) వద్దకు రైతులు భారీగా చేరుకున్నారు. అయితే పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి రైతులను అడ్డుకున్నారు.అటు బొద్దింకలు.. ఇటు రైతులు ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో మరోసారి బిజెపికి విపత్కర పరిస్థితి తప్పదా అంటూ విశ్లేషకులు వ్యాఖ్యలు చేస్తున్నారు. గతంలో కూడా రైతుల ఉద్యమం ముసుగులో చాలామంది ఢిల్లీలో తిష్ట వేసుకున్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడేందుకు ప్రణాళిక రూపొందించారు. అయితే పోలీసులు సమర్థవంతంగా అడ్డుకోవడంతో వారి పాచికలు పారలేదు. ఇప్పుడు మళ్లీ నీట్.. అమెరికా ఒప్పందం వంటి వాటిని ప్రధానంగా ప్రస్తావిస్తూ ఉద్యమాలు చేస్తున్నారు. అయితే దీని వెనక కూడా విదేశీ శక్తులు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. అందువల్లే ఈ ఉద్యమాలను ఉక్కుపాదంతో తొక్కి వేస్తున్నాయి.

# బెంగాల్ లో ఊపిరిపోసుకుంటున్న లెఫ్ట్ పార్టీలు

**కోల్ కత్తా :** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలిగిన తృణమూల్ కాంగ్రెస్ నేడు తీవ్ర అంతర్గత సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తన రాజకీయ వారసుడిగా మేనల్లుడు అభిషేక్ బెనర్జీని నిలబెట్టేందుకు పడుతున్న ఆరాటం, సీనియర్ నేతల్లో తీవ్ర తీవ్ర అసంతృప్తికి దారితీస్తోంది. అధికారం పోవడంతో పార్టీ ముఖ్యనేతలందా గుడ్ బై చెప్పేశారు. ప్రతిపక్ష రాజకీయ శూన్యత స్పష్టంగా కనిపిస్తోంది. ఇది సీపీఎంకు ఓ మంచి అవకాశంగా కనిపిస్తోంది. ఈ రాజకీయ పరిణామం సుదీర్ఘకాలం 34 ఏళ్లు రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన మార్క్సిస్ట్ కమ్యూనిస్ట్ పార్టీ అఖఎ-ఓ కి, లెఫ్ట్ ఫ్రంట్‌కు చారిత్రాత్మక అవకాశాన్ని తలుపు తడుతోంది. 2011లో మమతా తుఫాన్‌లో అధికారం కోల్పోయిన తర్వాత, సురక్షిత స్థావరం కోసం సీపీఎం కేడర్ పెద్ద ఎత్తున బిజెపి, టిఎంసి వైపు వలస వెళ్లారు. అయితే, గ్రామీణ బెంగాల్‌లో సీపీఎం నిశ్శబ్ద మూలాలు, సైద్ధాంతిక బలగాలు నేటికీ చెక్కుచెదరలేదు. తమ ఉనికిని కాపాడుకోవడానికి తాత్కాలికంగా ఇతర జెండాలు పట్టిన శ్రేణులు, ఇప్పుడు బీజేపీ అధికారంలోకి రావడం, మమతా పార్టీ నిర్వీర్యం అవుతున్న సూచనలు కనిపిస్తూండటం?త మళ్లీ ఎర్రజెండా వైపు చూస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ లెఫ్ట్ నేతలు పాత పద్ధతులను విడనాడి, కొత్త వ్యూహాలతో శ్రేణులను జాగృతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. మీనాక్షి ముఖర్జీ వంటి అత్యంత ప్రజాదరణ పొందిన యువనాయకులను ముందుంచి, కార్మికులు-రైతులు-యువత అజెండాతో బెంగాల్‌ను కాపాడుకుందాం పేరిట విస్తృత పాదయాత్రలు, ర్యాలీలు నిర్వహిస్తున్నారు. మత-కులాతీత రాజకీయాల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. ముఖ్యంగా యువతను ఆకట్టుకోవడానికి డిజిటల్ మీడియా, సోషల్ మీడియా వేదికల ద్వారా సీపీఎం విస్తృత ప్రచారం నిర్వహిస్తోందిఅయితే, సైద్ధాంతికంగా సానుకూల వాతావరణం ఉన్నప్పటికీ, ఆచరణలో సీపీఎం ముందు కొండంత సవాళ్లు నిలిచాయి. దశాబ్దకాలంగా అమానుష దాడులకు గురై దెబ్బతిన్న గ్రామస్థాయి కార్యకర్తలకు మాస్ ప్రొటెక్షన్ కల్పించడంలో పార్టీ అగ్రనాయకత్వం ఇంకా సంపూర్ణ విశ్వాసాన్ని నింపలేకపోతోంది. పైగా, కాంగ్రెస్ పార్టీతో చేసుకుంటున్న తాత్కాలిక పొత్తులు క్షేత్రస్థాయిలో ఓటర్లలో కొంత అయోమయాన్ని సృష్టిస్తున్నాయి. తమ పూర్వపు ఓటు బ్యాంకును ఆకర్షించడంలో లెఫ్ట్ ఫ్రంట్ వేస్తున్న అడుగులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఇంకా చాలా పోరాటం చేయాల్సిఉంది. తృణమూల్ ఎంత బలహీనపడితే సీపీఎంకు అంత మేలు జరుగుతుంది.పశ్చిమ బెంగాల్‌లో స్థానిక సమస్యలపై పోరాడే అసలైన ప్రతిపక్షంగా అవతరించే అర్హత, సైద్ధాంతిక పునాది సీపీఎంకి మాత్రమే ఉన్నాయి. బీజేపీ వైపు వెళ్లిన తమ పాత ఓటర్లను ఇంటికి రప్పించడంలోనూ, యువతలో ఉపాధి రాజకీయాల పట్ల నమ్మకం కలిగించడంలోనూ సీపీఎం నేతలు ఎంతవరకు సఫలమవుతారో అనే దానిపైనే బెంగాల్‌లో ఎర్ర సూర్యుడి పునరాగమనం ఆధారపడి ఉంటుంది.

# వినాయకచవితి ఉత్సవాలను,నిమజ్జన కార్యక్రమాలను దిగ్విజయం చేయడంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కీలకమైన పాత్ర పోషిస్తుంది..



**నాంపల్లి,హైదరాబాద్,జూలై23(సూర్యరేఖ)** హైదరాబాద్ లో వినాయక చవితి ఉత్సవాలను, నిమజ్జన కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహించడంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కీలకమైన పాత్ర పోషిస్తుందని,నగరంలో ప్రతిష్టాత్మకంగా జరిగే ఖైరతాబాద్ గణేష్తో పాటు ప్రతి మండపం వద్ద ఎలాంటి ఆటంకాలు లేకుండా వేడుకలు జరిగేలా ఈ సమితి పర్యవేక్షిస్తుందని భాగ్యనగర్ గణేశ గణేష్ ఉత్సవ సమితి కార్యదర్శి కౌడి మహేందర్,గోదా లక్ష్మీకాంత్ యాదవ్,లు పేర్కొన్నారు.రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గోదా లక్ష్మీకాంత్ యాదవ్ మాట్లాడుతూ...వందేమాతరం 150వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి గణేశ్ మండపాల వద్ద సెప్టెంబర్ 17న జాతీయ జెండా ఎగరేయాలని,వందేమాతరం గీతాలాపన చేయాలని,యువతకు సనాతన ధర్మంపై అవగాహన కల్పించాలని ఉత్సవ సమితి పిలుపునిచ్చిందని గోదా లక్ష్మీకాంత్ యాదవ్ తెలిపారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలల్లో యువత ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకుంటూ,డీజే సంస్కృతికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.ప్రతి గణేష్ మండపం వద్ద ఎలాంటి ఆటంకాలు లేకుండా వేడుకలు జరిగేలా ఈ సమితి పర్యవేక్షిస్తుందని,సంపూర్ణ భాద్యత ఆయా మండపాల నిర్వాహకులు తీసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ గణేశ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు సందుగారి శ్రీనివాస్,జోన కుంటి మధుసూదన్, మనీష్ తోరత్,బోడి అశ్విన్ కుమార్ యాదవ్,పవన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ బోనాలకు భారీ ఏర్పాట్లు..ఆలయాల సౌకర్యాలకు రూ.90 లక్షలతో సీసీ రోడ్డు పనులు





మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్,జూలై23(సూర్యరేఖ)** ఉప్పల్ డివిజన్‌లో జరిగే బోనాల మహోత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.మహంకాళి,పోచమ్మ ఆలయాలతో పాటు డివిజన్ పరిధిలోని ఇతర ఆలయాల వద్ద కూడా అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలోని నల్ల పోచమ్మ ఆలయం వద్ద రూ.90 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఆమె పరిశీలించారు.బోనాల సందర్భంగా భక్తుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను సూచించారు. ఆలయాల వద్ద విద్యుత్ వెలుగులు,పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యం,బ్యారికేడ్లు,ఇతర అవసరమైన ఏర్పాట్లను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. త్వరలోనే అన్ని శాఖల అధికారులతో కలిసి ఆలయాలను సందర్శించి,అవసరమైన అదనపు పనులు, సౌకర్యాలపై సమీక్ష నిర్వహించి ఏర్పాట్లను పూర్తి చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర కాలనీ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి,సల్లా ప్రభాకర్ రెడ్డి,వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గౌడ్,జనరల్ సెక్రటరీ నంగి శ్రీనివాస్,ట్రెజరర్ మిట్టపల్లి శ్రీనివాస్, కాలనీ సభ్యులు భాస్కర్,విజయేందర్ రాజు, పాండు ,చంద్రుడు,ధర్మారెడ్డి,సోమయ్య,నంగి సంపత్, భరత్,జక్కుల సంపత్, ఆనంద్, ఓంకార్,ప్రతాప్ సింగ్, రామకృష్ణ,సంజీవ్ రెడ్డి,కృష్ణారెడ్డి, రాజేంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవారాహి మాత నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న పరమేశ్వర్ రెడ్డి



**ఉప్పల్,జూలై23(సూర్యరేఖ)** తిరుమలనగర్,మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ లో శ్రీశ్రీశ్రీ పోచమ్మ పెద్దమ్మ తల్లుల దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవరహిమాత నవరాత్రి మహోత్సవాలలో భాగంగా కుంకుమార్చన కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉప్పల్ నియోజకవర్గం ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారో గ్యాలతో ఉండాలని ప్రార్థించారు.అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, పరమేశ్వర్ రెడ్డికి ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ కోర్డినేటర్ వరలక్ష్మి,డివిజన్ అధ్యక్షులు అంజయ్య, శ్రీనివాస్, మల్లికార్జున్,ఉదయ్,కిషోర్,అనిల్ కుమార్ గుప్తా,సురేష్,శ్రీనివాస్ రెడ్డి,శ్రవణ్ గౌడ్, సమ్మయ్య,రూపేందర్ రెడ్డి,బాలకృష్ణ,కృష్ణ,జెమినీ, సునీత,రాణి, విట్టల్,శ్రీకాంత్,ఆలయ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

## "సర్"ప్రక్రియ సాఫీగా సాగేలా సహాయ కేంద్రాలు పని చేయాలి..

కాంగ్రెస్ శ్రేణులకు మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పిలుపు




**ఉప్పల్,జూలై23(సూర్యరేఖ)**సర్ ప్రక్రియ సాఫీగా,వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఉప్పల్ పద్మావతి కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఈగ ఆంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి గురువారం పరిశీలించారు.నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియతో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు.బీఎల్ఓతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పద్మావతికాలనీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి,లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి,సల్ల ప్రభాకర్ రెడ్డి,పూజారి హనుమంతు,కృష్ణ ,నరసింహారెడ్డి, బలరాం నాయుడు,మధు,లక్ష్మణరావు,రవి,రవికుమార్, నాగేష్,వేణు, అమృత,శైలజ,గోరిగె మహేష్, అలుగుల అనిల్,నోముల సురేష్,తుమ్మల రాజేందర్ రెడ్డి,నాగూర్ భాష ,తుమ్మల దేవేందర్ రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి,బచ్చారాం,మరియు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


## యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మీనాక్షి నటరాజన్ జన్మదిన వేడుకలు..



**మందమర్రి,జూలై23(సూర్యరేఖ)**తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మందమర్రి పట్టణంలోని మనోవికాస్ పాఠశాలలో యువజన కాంగ్రెస్ నాయకుడు మహంత్ అర్జున్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మహంత్ అర్జున్ కుమార్ మాట్లాడుతూ...తెలంగాణ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మీనాక్షి నటరాజన్ విశేషంగా కృషి చేస్తున్నారని,పార్టీ శ్రేణులకు ఆమె అందిస్తున్న మార్గదర్శకత్వం స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆమెకు ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు.అలాగే చెన్నూరు ఎమ్మెల్యే,మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి నాయకత్వంలో యువజన కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజాసేవలో ముందుంటున్నారని పేర్కొన్నారు.చెన్నూరు నియోజకవర్గంలో రోడ్లు,విద్య,వైద్యం,మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంపై స్పందించిన ఆయన,విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు,నైతిక బాధ్యత వహిస్తూ సంబంధిత అధికారులు తమ పదవులకు రాజీనామా చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు బాకం రవి, ఓరగంటి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ స్వామి తుపాకితో కాల్చుకుని ఆత్మహత్య..

తన భార్య,పిల్లలు చాలా మంచివాళ్లు అంటూ సూసైడ్ నోట్..



**నాంపల్లి,హైదరాబాద్,జూలై23(సూర్యరేఖ)** తెలంగాణ డీజీపీ కార్యాలయంలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది.గురువారం తెల్లవారు జామున డీజీపీ ఆఫీస్‌లో కానిస్టేబుల్ స్వామి ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయాడు.ఉదయం 5.30 సమయంలో వాష్ రూమ్ లో తన సర్వీస్ తుపాకీతో కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.తీవ్ర గాయంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.కుటుంబ కలహాలతోనే స్వామి ఆత్మహత్య చేసుకొన్నట్లు భావిస్తున్నారు.తన భార్య పిల్లలను ఏమి అనవద్దని,చనిపోయి దయ్యం అయినా కూడా వాళ్ళను చూసుకుంటానని వాళ్ళు మంచివాళ్ళని ఓనోట్ బుక్ లో కానిస్టేబుల్ స్వామి సూసైడ్ నోట్ రాసినట్టు తెలిసింది.లభ్యమైన సూసైడ్ నోట్ ను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆయన మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న దర్యాప్తు చేస్తున్నారు.

## వసతి గృహంలో ఫుడ్ పాయిజన్..15 మందికి పైగా విద్యార్థినులు అస్వస్థత



**బెల్లంపల్లి,జూలై23 (సూర్యరేఖ)** బెల్లంపల్లి పట్టణంలోని మహాత్మాజ్యోతిబా పూలే సంక్షేమ బాలి కల వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ ఘట న కలకలం రేపింది. బుధవారం రాత్రి భోజనం చేసిన అనంతరం పలువురు విద్యార్థినులు ఒక్కసారిగా వాంతులు,వికారం,కడుపునొప్పితో అస్వస్థతకు గురయ్యారు.విషయం తెలుసుకున్న వసతి గృహ సిబ్బంది వెంటనే 15మందికి పైగా విద్యార్థినులను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.వైద్యులు వారికి చికిత్స అందించగా ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.ఘటన విషయం తెలుసుకున్న ఆర్డీసీవో శ్రీధర్,డీసీవో శిరీష, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దావా స్వాతి ఆసుపత్రికి చేరుకుని విద్యార్థినులను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థినులకు అవసరమైన అన్ని వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.ఫుడ్ పాయిజన్‌కు గల కారణాలపై విచారణ చేపట్టి,ఆహార నమూనాలను పరిశీలించనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా నిజాంపేటలో కాంగ్రెస్ ధర్నా..







మోడీ,ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్....

**నిజాంపేట,జూలై23(సూర్యరేఖ)** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రతిపక్ష నాయకుడు, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా గురువారం నిజాంపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్ నాయకత్వంలో కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రధాని నరేంద్రమోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్షల అంశంపై విద్యార్థులు శాంతియుతంగా నిరసన చేపడుతుండగా వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. దీనికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీతో పాటు కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ త్యాగాల సంప్రదాయం కలిగిన పార్టీ అని, ఇందిరా గాంధీ నుంచి రాజీవ్ గాంధీ వరకు దేశానికి చేసిన సేవలను ఎవరూ మరచిపోలేరని పేర్కొన్నారు.విద్యార్థి నాయకులపై జరిగిన చర్యలకు కేంద్ర ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పి,విద్యార్థుల హక్కులను పరిరక్షించాలని మండల కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేశారు.అనంతరం నిజాంపేట ఎస్ఐ రాజేష్ ధర్నా స్థలానికి చేరుకుని కాంగ్రెస్ నాయకులతో మాట్లాడి వారికి సర్దిచెప్పడంతో ధర్నాను విరమించారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మట బాబు,పీఎస్‌సీఎస్ చైర్మన్ మహేందర్ రెడ్డి,సర్పంచ్‌లు బొమ్మన మల్లేశం, రామచందర్ నాయక్,జెల్ల లక్ష్మణ్ గౌడ్,లక్ష్మాగౌడ్, ఉపసర్పంచ్‌లు ఆకుల మహేందర్,అంజిరెడ్డి, కుమార్, దేవరాజ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గరుగుల శ్రీనివాస్,కొమ్మట సుధాకర్, రాజేష్, కనకరాజు,శ్రీకాంత్,కొండల్, పరశురాములు, భూపతి రెడ్డి,టంకరి లక్ష్మణ్,రాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డా..బురద గుంటన..

కల్వకుంట ప్రాథమిక పాఠశాల వెనుక రహదారి అధ్వానం..

పట్టించుకోని అధికారులు..అవస్థల్లో విద్యార్థులు, గ్రామస్థులు..



**నిజాంపేట,జూలై23(సూర్యరేఖ)**మండల పరిధిలోని కల్వకుంట ప్రాథమిక పాఠశాల వెనుక రహదారి చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది .గుంతల్లో నీరు నిలిచిపోవడంతో విద్యార్థులు,గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ద్విచక్ర వాహనదారులు జారిపడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని గ్రామస్థులు వాపోతున్నారు.వెంటనే సీసీ రోడ్డు నిర్మించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఏరియా జీఎంను కలిసిన ఎస్‌బీఐ యాపల్ శాఖ నూతన మేనేజర్



**మందమర్రి,జూలై23(సూర్యరేఖ)** మందమర్రి ఏరియాలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)యాపల్ శాఖ నూతన బ్రాంచ్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన బి.కళారామన్ గురువారం మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన బ్రాంచ్ మేనేజర్ బి.కళారామన్ జనరల్ మేనేజర్‌కు పుష్పగుచ్ఛం అందజేయగా,శాలువాతో సత్కరించారు.అనంతరం మాట్లాడిన జీఎం ఎన్. రాధాకృష్ణ,సింగరేణి సంస్థకు ఎస్‌బీఐ యాపల్ శాఖతో ఎన్నో సంవత్సరాలుగా సుహృద్భావ సంబంధాలు కొనసాగుతున్నాయని తెలిపారు. బ్యాంకు యాజమాన్యం సహకారంతో సింగరేణి ఉద్యోగులు,కార్మికులకు నాణ్యమైన బ్యాంకింగ్ సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఈ పరస్పర సహకారం కొనసాగుతూ సంస్థ అవసరాలకు అనుగుణంగా బ్యాంకు సేవలు మరింత మెరుగుపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ యాపల్ శాఖ,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## చల్మెడ హైస్కూల్‌కు వాటర్ ప్యూరిఫైయర్ అందజేత



**నిజాంపేట,జూలై 23(సూర్యరేఖ)**మండల పరిధిలోని చల్మెడ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గ్రామ సర్పంచ్ బొమ్మన మల్లేశం రూ. 15 వేల విలువైన వాటర్ ప్యూరిఫైయర్‌ను అందజేశారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఈ వాటర్ ప్యూరిఫైయర్‌ను అందించినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆకుల మహేందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యాదగిరి,ఉపాధ్యాయులు, గ్రామస్తులు వడ్ల తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది..

డీఎంహెచ్‌వో



**బెల్లంపల్లి,జులై23(సూర్యరేఖ)** బెల్లంపల్లి మహాత్మాజ్యోతిబా పూలే బాలికల సంక్షేమ పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటనతో అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్యపరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌వో)నరేందర్ రాథోడ్ తెలిపారు. గురువారం ఆస్పత్రిని సందర్శించిన ఆయన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని చికిత్స వివరాలను సమీక్షించారు. మొత్తం 30మంది విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా,చికిత్స అనంతరం ఆరోగ్యం మెరుగుపడిన కొందరిని తిరిగి పాఠశాలకు పంపించినట్లు తెలిపారు. మిగిలిన వారికి అవసరమైన వైద్య సేవలు కొనసాగుతున్నాయని చెప్పారు.పాఠశాలలోనే వైద్య బృందాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు అవసరమైన చికిత్సలు అందిస్తున్నామని,పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని డీఎంహెచ్‌వో వెల్లడించారు.

## నెన్నెలలో వరి సాగుపై జిల్లా వ్యవసాయ అధికారి క్షేత్ర పరిశీలన



**నెన్నెల,జులై23(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలోని రాయిపేట్, చిత్తాపూర్, గుండ్లసోమారం,మెట్‌పల్లి, నార్వాయిపేట్ గ్రామాల్లో జరుగు తున్న వరి నాట్లను జిల్లా వ్యవసాయ అధికారి ఇ.సురేఖ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రైతులకు పలు సాగు సూచనలు చేశారు.నారు నాటే ముందు నారు కొనలను త్రుంచాలని,20--25 రోజుల వయస్సు ఉన్న నారునే నాటాలని,ముదురు నారు ఉపయోగించవద్దని సూచించారు.వరికి ప్రత్యామ్నాయంగా కందులు ,పెసలు, మినుములు, జొన్న,మొక్కజొన్న, నువ్వులు వంటి పంటలను సాగు చేయాలని,సేంద్రీయ వ్యవసాయంలో భాగంగా కూరగాయల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులకు సూచించారు.భూమి ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా రైతు ఖాతా నమోదు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పుష్పాల సృజన,వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటు కీలకం--సర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయండి..

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్,జులై23(సూర్యరేఖ)**ఉప్పల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న సర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)కార్యక్రమం ఆశించిన వేగంతో సాగడం లేదని,ప్రతి నాయకుడు,కార్యకర్త బాధ్యతగా ఇంటింటికీ తిరిగి అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సూచించారు.మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ పరిధిలోని తిరుమలనగర్ లో సర్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు.ప్రతి ఓటు ఎంతో కీలకమని,ఒక్క ఓటు కూడా వృథా కాకుండా ప్రతి అర్హత కలిగిన వ్యక్తి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు.పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి సరిచేసుకునేలా సహకరించాలని కోరారు. పార్టీ నాయకులు,బూత్ స్థాయి ఇన్‌ఛార్జీలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఇంటింటికీ వెళ్లి సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనదని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రభుదాస్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ,కాలనీవాసులు,తదితరులు పాల్గొన్నారు.

## నందులపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి:

జిల్లా పంచాయతీ అధికారి



**నెన్నెల,జులై 23(సూర్యరేఖ)** గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా నెన్నెల మండలం నందులపల్లి గ్రామపంచాయతీని ఆదర్శగ్రామంగా అభివృద్ధి చేసేందుకు ఎంపిక చేశారు.ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు గ్రామాన్ని సందర్శించి పారిశుధ్యం,తాగునీటి సరఫరా, రహదారులు,మురుగు కాలువలు,వీధి దీపాలు, పచ్చదనం,ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అన్ని శాఖల సమన్వయంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని అధికారులకు ఆదేశించారు.కార్యక్రమంలో డీఎల్‌పీఓ సతీష్, ఎంపీడీవో పూర్ణచందర్,ఎంపీవో శ్రీనివాస్,సర్పంచ్ వనిత,ఏపీఓ నరేష్,ఏపీఎం త్రయంబకేశ్వరం, ఐసీడీఎస్ సూపర్వైజర్ సుజాత,పంచాయతీ కార్యదర్శి సరిత,గ్రామపంచాయతీ అధికారులు, వార్డు సభ్యులు ,ప్రజాప్రతినిధులు ,సిబ్బంది పాల్గొన్నారు.

# నాచారం బొడ్రాయి వద్ద సర్ వగాహన ప్రచార వాహనాన్ని ప్రారంభించిన పరమేశ్వర్ రెడ్డి,వరలక్ష్మి






**నాచారం,జూలై23(సూర్యరేఖ)** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్--సర్ కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు నాచారం బొడ్రాయి వద్ద గురువారం ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకురాలు వరలక్ష్మి సర్ అవగాహన ప్రచార వాహనాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని టీపీసీసీ లేబర్ సెల్ వైస్ ప్రెసిడెంట్ వి.ఎస్.ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం పరమేశ్వర్ రెడ్డి,నాచారం,హెచ్ఎంటీ డివిజన్ల పరిధిలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన పలు సర్ సహాయ కేంద్రాలను సందర్శించి,ప్రజలకు ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రాముఖ్యతను వివరించారు.అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని,అవసరమైన దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు.ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కృష్ణారెడ్డి,హెచ్.ఆర్.మోహన్, రమేష్ గౌడ్,రామ్ రెడ్డి,నాచారం డివిజన్ అధ్యక్షుడు నూతంకంటి రాజు,శ్రీకాంత్ గౌడ్,హెచ్ఎంటీ డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్,అశ్వత్థామరెడ్డి, ఎం.రాజిరెడ్డి, షరీఫుద్దీన్, నర్సింగ్ రావు,రఘు,అజీమ్, ఫిరోజ్,సంతోష్ రెడ్డి, ఖయ్యూం, షాహిద్,రవియాదవ్, కృష్ణయాదవ్, శ్రీనివాస్ రెడ్డి,సుధాకర్ రెడ్డి, జి.రాకేష్,నిఖిల్ సాయి,శ్రీధర్, బాలరాజ్,మహిళా కాంగ్రెస్ నాయకులు ఉమ,భాతమ్మ, భూలక్ష్మి,భావనాగౌడ్, సుజాత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజారోగ్య రక్షణే ధ్యేయం..





## వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి

## మరిపెడ పీహెచ్‌సీలో సమీక్ష సమావేశం..

**మరిపెడ,జూలై23(సూర్యరేఖ)** ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా స్థానిక మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో గురువారం అన్ని ఆరోగ్య కార్యక్రమాలపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ గుగులోత్ రవి మాట్లాడుతూ...వర్షాకాలం నేపథ్యంలో సిబ్బంది క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో దోమల ద్వారా,కలుషిత నీటి ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.సీజనల్ వ్యాధులైన మలేరియా,డెంగ్యూ,చికున్‌గున్యా, టైఫాయిడ్,వైరల్ జ్వరాలు ప్రబలకుండా ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ప్రతి మంగళవారం,శుక్రవారం గ్రామస్థాయి అధికారులతో కలిసి డ్రైడే కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టాలని సూచించారు.అలాగే ముందస్తు ప్రణాళిక ప్రకారం అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని,14--15సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించేలా తల్లిదండ్రులను చైతన్యపరచాలని సూచించారు.గ్రామాల్లోని కిశోర బాలికలను గుర్తించి అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించాలని తెలిపారు.కొత్తగా వివాహమైన దంపతులను గుర్తించి రక్తహీనత నివారణతో పాటు సురక్షిత గర్భధారణపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.క్షయవ్యాధి (టీబీ)నిర్ధారణ కోసం కఫం నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించాలని,30సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ బీపీ,షుగర్ పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు.ఈ సమావేశంలో డాక్టర్ పూజిత,డాక్టర్ స్వామి,డాక్టర్ కిరణ్,పీహెచ్ఎన్ఓ మంగమ్మ,సూపర్‌వైజర్లు ఆచార్యులు, మాధవి,పల్లె దవాఖాన సిబ్బంది అఖిల,ఝాన్సీ,అనిత, సౌజన్య,సతీష్,ఉపేంద్ర,సరిత,ఏఎన్ఎంలు,ఆరోగ్యశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ మజ్దూర్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఎంఎస్ జెండా ఆవిష్కరణ..

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్

**నాచారం,జూలై23(సూర్యరేఖ)** భారతీయ మజ్దూర్ సంఘ్(బిఎంఎస్)ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డీపీస్ ) ఆవరణలో బీఎంఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై బీఎంఎస్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ...భారతీయ మజ్దూర్ సంఘ్ దేశంలోనే అతిపెద్ద,రాజకీయాలకు అతీతమైన స్వతంత్ర కార్మిక సంఘంగా కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని కొనియాడారు"దేశహితం కోసం పని చేస్తాం--పనికి తగిన ప్రతిఫలం పొందుతాం"అనే నినాదంతో బీఎంఎస్ కార్మికుల్లో దేశభక్తి,కర్తవ్యనిష్ఠ, బాధ్యతాయుతమైన హక్కుల సాధనకు ప్రేరణ కల్పిస్తోందని ఆయన అన్నారు.కార్మికుల సంక్షేమం,సామాజిక భద్రత,ఉపాధి హక్కుల పరిరక్షణలో బీఎంఎస్ విశేష సేవలు అందిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు,వర్కింగ్ ప్రెసిడెంట్ పోతగాని గోపాల్ గౌడ్,ఉపాధ్యక్షుడు దాదాగిరి,హరిప్రసాద్,యు.శ్రీనివాస్,కే.అనురాధ, బి. వాసుదేవులు,బి.కొమరయ్య,కే.రామ్,కే.శంకర్, చంద్రమౌళి,బాలరాజ్ గౌడ్,ఎన్.లక్ష్మి,బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్,మీర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడు రాంప్రదీప్,మల్లాపూర్ బీజేపీ నాయకులు,జిల్లా కౌన్సిల్ సభ్యుడు గంగిశెట్టి రవీంద్ర సాగర్‌తో పాటు బీఎంఎస్ నాయకులు,కార్మిక సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## రైతు రుణాలపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అమలు చేయాలి..

### సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్



**మరిపెడ,జూలై23(సూర్యరేఖ)**రైతులు వివిధ బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అమలు చేసి,వడ్డీల్లో రాయితీలు కల్పించాలని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు ఎండి అబ్దుల్ రషీద్ డిమాండ్ చేశారు.మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామంలో నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మండలంలోని అనేక మంది రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాల భారంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం రూ.2లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేసిన నేపథ్యంలో,రూ.2 లక్షలకు పైబడిన రుణాలు కూడా మాఫీ అవుతాయనే ఆశతో పలువురు రైతులు తమ రుణాలను సకాలంలో చెల్లించలేకపోయారని పేర్కొన్నారు.అయితే రుణమాఫీపై స్పష్టత లేకపోవడంతో అసలు రుణాలకు భారీ వడ్డీలు చేరి రైతులపై అదనపు భారం పడిందన్నారు.రుణ బకాయిల కారణంగా రైతుల బ్యాంకు ఖాతాలపై హోల్డ్‌లు విధించడంతో రైతుబంధు,పీఎం-కిసాన్ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా అందాల్సిన పెట్టుబడి సాయం కూడా పూర్తిస్థాయిలో రైతులకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు ఒకేసారి మొత్తం రుణ బకాయిలు చెల్లించే పరిస్థితిలో లేరని,అందువల్ల ప్రత్యేక చర్యలు తీసుకుని వారికి ఉపశమనం కల్పించాలని ప్రభుత్వాన్ని,బ్యాంకు యాజమాన్యాలను ఆయన కోరారు.ఈ సమావేశంలో లక్ష్మణ్,వీరన్న,భగవత్,దీపక్,రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు"సర్"వివరాలను తెలిపిన కనకలక్ష్మి



**శేరిలింగంపల్లి,జులై 23(సూర్యరేఖ)** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ,ఆధ్వర్యంలో మియాపూర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గంలో నిర్వహిస్తున్న "సర్"కార్యక్రమంలో భాగంగా బీఎల్ఓ లు,బీఎల్ఏలు నాయకులతో కలిసి వివరాలను సేకరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... "సర్"కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని, మీ పేరు ఓటరు జాబితాలో నమోదై ఉందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని,ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటరు నమోదు వివరాలు సరైనవిగా,తాజాగా ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ ముఖ్యనాయకులు, తాజా,మాజీ కార్పోరేటర్లు,పాపిరెడ్డినగర్ లోని సీనియర్ మహిళా నాయకురాలైన కే. కనక లక్ష్మి, బీఎల్ఓలు ,బీఎల్ఏలు ,తదితరులు పాల్గొన్నారు.

## జియాగూడలో తాగు నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలి...ధర్పల్లి నర్సిములు



**నాంపల్లి,హైదరాబాద్, జూలై23(సూర్యరేఖ)** జియాగూడ డివిజన్ పరిధిలోని కేశవస్వామినగర్ పరిసర ప్రాంత బస్తీలలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పరిష్కరానికి చర్యలను వేగవంతం చేయాలని కోరుతూ సమస్యపై బీజేపీ రాష్ట్ర షెపర్డ్ సెల్ కో కన్వీనర్,కేఎస్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దర్పల్లి నర్సిములు,బీజేపీ జియాగూడ డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి జిల్లాల వెంకటేష్ యాదవ్ బృందంతో మహానగర మంచినీటి సరఫరా డివిజన్ 4జి.ఎం.అల్తాఫ్ హుస్సేన్ ని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని,రోజు విడిచి రోజు నీరు విడుదల చేసే తాగు నీరులో ప్రెషర్ తో సమయ పాలనా లేకుండా ఎవరికీ సరఫరా కావడం లేదని,సక్రమంగా సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు.జియాగూడ జియాగూడలో ఇప్పుడు ఇస్తున్నటువంటి సమయాన్ని పొడిగించాలని, సరఫరా రాత్రి సమయంలో కాకుండా ఉదయం ఇవ్వగలరని జిఎంను కోరడం జరిగిందన్నారు.సమస్య పరిష్కారం కాకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని బస్తీ వాసులు హెచ్చరించారు.ఈ కార్యక్రమం నాయకులు డి.యాదగిరి,బండారి బాబు,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీకి సంఘీభావంగా కాంగ్రెస్ నిరసన ర్యాలీ..

**ర్యాల రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో మెట్టుగూడ డివిజన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ**





**సికింద్రాబాద్,జూలై 23(సూర్యరేఖ)** ఢిల్లీలో విద్యార్థులు,యువత చేపట్టిన శాంతియుత నిరసనకు సంఘీభావం తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై పోలీసులు వ్యవహరించిన తీరును ఖండిస్తూ,సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదాం సంతోష్ కుమార్ నాయకత్వంలో గురువారం సంఘీభావ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ ర్యాల రాజేందర్ యాదవ్ ఆధ్వర్యంలో,మెట్టుగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మెట్టుగూడ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, విద్యార్థులు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ అణిచివేత విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ర్యాల రాజేందర్ యాదవ్ మాట్లాడుతూ...ఢిల్లీలో విద్యార్థులు, యువత తమ సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే కేంద్ర ప్రభుత్వం అణిచివేత ధోరణిని అవలంబించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. విద్యార్థులు, యువత తమ హక్కుల కోసం గళం విప్పితే వారిపై దౌర్జన్యానికి పాల్పడడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థులకు సంఘీభావం తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై పోలీసులు బలప్రయోగం చేసి అదుపులోకి తీసుకోవడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని ఆయన ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని,ఆ హక్కును హరించే చర్యలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో మెట్టుగూడ డివిజన్ అధ్యక్షుడు బెన్న, కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ భాయ్,సైలేష్, రఘుపతి,అబ్రహీం,శ్రీనివాస్,ప్రతివరాజ్,మహిళా నాయకులు రమణి,పుష్పమ్మ,రూత్ క్లారి,కళ్యాణి, విద్యార్థులు,యువత, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ అణిచివేత విధానాలను ఖండిస్తూ నిరసన తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో సమన్వయం..

**34 వార్డుల నాయకులతో సమీక్ష సమావేశం..ప్రతి అర్హుడి ఓటు నమోదు చేయాలని పిలుపు**



**బెల్లంపల్లి,జులై24(సూర్యరేఖ)** బెల్లంపల్లి,సమగ్ర ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. బెల్లంపల్లి పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో 34 వార్డులకు సంబంధించిన ఎస్ఐఆర్ ప్రత్యేక పరిశీలన పురోగతిపై విస్తృత స్థాయి అవగాహన, సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సూచనల మేరకు,ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఆదేశాలు,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్‌రెడ్డి సూచనలతో పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి ఫోన్ ద్వారా మాట్లాడి ప్రతి ఓటరితో ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిచేయించి, పాత ఓటరు జాబితా లేదా 2002 ఓటరు వివరాల ఆధారంగా సమాచారాన్ని సక్రమంగా నమోదు చేయాలని సూచించారు .ఇప్పటివరకు నియోజకవర్గంలో 90 నుంచి 100శాతం వరకు ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తయిందని,ఇందుకు కృషి చేసిన బీఎల్ఏలు ,బీఎల్‌వోలు,పార్టీ నాయకులు, కార్యకర్తలను అభినందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బెల్లంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి కాశీపాక రాజేష్ మాట్లాడుతూ...ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని అన్నారు. పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ...అర్హత కలిగిన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేయాలని సూచించారు. సమావేశంలో చిలుముల శంకర్,రొడ్డ శారద,దామెర శ్రీనివాస్,దేవసాని ఆనంద్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు,ప్రజాప్రతినిధులు,మహిళా నాయకులు, బీఎల్ఏలు,బూత్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో సమస్యలపై నివాసితుల అసంతృప్తి

**రోడ్లు,వీధి దీపాలు,పారిశుద్ధ్య సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**



**మందమర్రి,జూలై23(సూర్యరేఖ)** మందమర్రి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు వర్షాకాలంలో మరింత తీవ్రమయ్యాయని కాలనీవాసులు తెలిపారు. గురువారం డబుల్ బెడ్ రూంకాలనిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... పట్టాలు పంపిణీ చేసి 20నెలలు పూర్తయినా ఇప్పటికీ సీసీ రోడ్ల నిర్మాణం ప్రారంభం కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కాలనీ రోడ్లు పూర్తిగా బురదమయంగా మారడంతో పాటు గడ్డి,పిచ్చి మొక్కలు విస్తారంగా పెరిగి రాకపోకలకు ఆటంకం కలుగుతోందని వారు తెలిపారు. రాత్రి వేళల్లో స్ట్రీట్ లైట్లు సరిగా వెలగకపోవడంతో భద్రతాపరమైన ఆందోళనలు కూడా వ్యక్తమవుతున్నాయని అన్నారు. రోడ్లు మంజూరయ్యాయని సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు గత 20 నెలలుగా చెబుతున్నప్పటికీ పనులు మాత్రం ప్రారంభం కాలేదని కాలనీవాసులు ఆరోపించారు. తమకాలనీ కంటే తరువాత పట్టాలు పొందిన రవీంద్రఖని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో ఇప్పటికే సీసీ రోడ్లు,సెంటర్ లైట్లు, స్ట్రీట్ లైట్లు,సీసీ కెమెరాలు,బోర్లకు విద్యుత్ మీటర్లు, విద్యుత్ బిల్లుల చెల్లింపు వంటి సౌకర్యాలను మున్సిపాలిటీ కల్పించిందని గుర్తు చేశారు. అదే తరహా అభివృద్ధి తమ కాలనీలో కూడా చేపట్టాలని కోరారు. కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానిక అధికార పార్టీ నాయకులు రాష్ట్ర మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి దృష్టికి తీసుకెళ్లి,వెంటనే రోడ్లు, వీధి దీపాలు,పారిశుద్ధ్య పనులతో పాటు ఇతర మౌలిక వసతులను కల్పించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేశారు.

## పేపర్ లీకేజీలపై పార్లమెంట్‌లో కాంగ్రెస్ ఆందోళన.

**యువతకు అండగా గడ్డం వంశీకృష్ణ**



**బెల్లంపల్లి,జూలై23(సూర్యరేఖ)** దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలు,పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలకు నిరసనగా పార్లమెంట్ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఎంపీలు చేపట్టిన ఆందోళనలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ..యువత హక్కుల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. పోటీ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి,పేపర్ లీకేజీలకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని యువత చేస్తున్న న్యాయమైన డిమాండ్‌కు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇస్తోందన్నారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి యువతను నిరాశపరిచిందని విమర్శించారు. తెలంగాణలో విద్యార్థుల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా,వారికి న్యాయం జరిగేలా అన్ని వర్గాలు కృషి చేయాల్సిన అవసరం ఉందని గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు.

## స్పందించిన అధికారులు...మేడ్చల్--మజీద్‌పూర్ రహదారిపై గుంతల పూడ్చివేత

**'సూర్యరేఖ'కథనానికి అధికారుల తక్షణ స్పందన..**

**గుంతలు పూడ్చడంతో వాహనదారులకు స్వల్ప ఊరట..**

**శాశ్వత పరిష్కారం కోసం పూర్తి స్థాయి రహదారి మరమ్మతులు చేపట్టాలని ప్రజల విజ్ఞప్తి**




**మేడ్చల్,జూలై23(సూర్యరేఖ)** మేడ్చల్ చెక్‌పోస్ట్ నుంచి మజీద్‌పూర్ వరకు ఉన్న ప్రధాన రహదారిపై భారీ గుంతల కారణంగా వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై "సూర్యరేఖ"లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం రహదారిపై ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చివేసి,వాహనదారులకు స్వల్ప ఊరట కల్పించారు. ఇటీవల కురిసిన వర్షాలతో రహదారి మరింత దెబ్బతిని, ద్విచక్ర వాహనదారులు,విద్యార్థులు,ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమస్యను వెలుగులోకి తీసుకువస్తూ ప్రచురించిన కథనంపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి గుంతలను పూడ్చించారు. ఈ చర్యతో స్థానికులు,వాహనదారులు అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూ,తాత్కాలికంగా గుంతలు పూడ్చడం కాకుండా మొత్తం రహదారికి నాణ్యమైన శాశ్వత మరమ్మతులు చేపట్టి భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరుతున్నారు. ప్రస్తుతం గుంతల పూడ్చివేతతో ప్రయాణికులకు కొంత మేర ఇబ్బందులు తగ్గి రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి.

## వాహనాల పాత సామగ్రికి ఈనెల 27న బహిరంగ వేలం..




**మంచిర్యాల,జూలై23 (సూర్యరేఖ)**రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు శాఖ వాహనాలకు సంబంధించిన పాత స్పేర్ పార్ట్స్, వినియోగించిన టైర్లు,బ్యాటరీలు, ఉపయోగించిన ఇంజిన్ ఆయిల్ తదితర సామగ్రికి ఈ నెల 27న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో ఈ వేలం నిర్వహించనున్నట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెద్దపల్లి,మంచిర్యాల జిల్లాలకు చెందిన ఆసక్తి గల వ్యక్తులు ఈ బహిరంగ వేలంలో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వేలానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం ఎంటీవో మల్లేశంను 8712656616 నంబర్‌లో సంప్రదించాలని పోలీస్ కమిషనర్ కోరారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23,
Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# ఆటో డ్రైవర్ల సమస్యలపై ఐక్య పోరాటానికి యూనియన్ల తీర్మానం..



**మంచిర్యాల,జూలై23(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లాలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అన్ని ఆటో యూనియన్లు ఐక్యంగా పోరాటం చేయాలని నిర్ణయించాయి.గురువారం పట్టణంలోని వివేకవర్ధిని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో హెచ్ఎంఎస్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు ఆటో యూనియన్ల నాయకులు పాల్గొని సమస్యలపై చర్చించారు.ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఏ (ఆర్ డబ్ల్యుఎ), బీఆర్టీయూ (బిఆర్ టియు),బీఎంఎస్( బిఎంఎస్), 246మంచిర్యాల జిల్లా ఆటో యూనియన్,జేఏసీ ఆటో యూనియన్ తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ఆటోలకు గిరాకీ గణనీయంగా తగ్గిపోవడంతో వేలాది మంది ఆటో డ్రైవర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రాపిడో కార్యకలాపాలను అరికట్టేందుకు అన్ని యూనియన్లు ఐక్యంగా ఉద్యమించాలని, అవసరమైతే మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా బంద్ నిర్వహించి నిరసనలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు.ఈ సమావేశంలో ప్రభుత్వం ముందు పలు డిమాండ్లు ఉంచారు.రూ.1,000 కోట్ల నిధులతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని,ఆటో సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని,ఆటో డ్రైవర్లకు రోజుకు రూ.500 చొప్పున జీవన భృతి అందించి నెలకు రూ.15 వేలుగా చెల్లించాలని కోరారు.50 సంవత్సరాలు దాటిన ఆటో డ్రైవర్లకు నెలకు రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని,మహాలక్ష్మి పథకం ప్రభావంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యలకు పాల్పడిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంఎస్ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్,వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి షఫీ, ప్రధాన కార్యదర్శి తగరం శ్రీనివాస్,జేఏసీ జిల్లా అధ్యక్షుడు కట్ట రామ్‌కుమార్,ఆర్డబ్ల్యూఏ ఆటో యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సుద్దాల రాజు, బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు చల్ల విక్రం,246ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొట్ట మధు, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అభి పాషా, కలువల అంజయ్య,జూదం రాజు,దిలీప్ గౌడ్,పులి రాజేందర్ గౌడ్,ఆవుల సుధాకర్,రాగిడి రాజు,మాలం జగదీష్,నున్నావత్ చిరంజీవి,పిల్లి ఆనంద్, గోల్డ్‌మాన్ శీను,ముద్దం రాజేశ్వర్ రెడ్డి,ఎండి హుస్సేన్,పల్లపు శ్రీనివాస్,ఎండి అజీముద్దీన్, రాజుగారి మహేష్,అనంతుల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి..





## సిపిఎం మంచిర్యాల జిల్లా కమిటీ డిమాండ్

**?ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,జూలై23(సూర్యరేఖ)** ?దేశంలో నీట్ పేపర్ లీకేజీకి నిరసనగా సిపిఎం మంచిర్యాల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాల బస్టాండ్ ఆవరణలో నల్ల గుడ్డలతో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ?ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.నీట్ పేపర్ లీకేజీతో దేశంలో విద్యా వ్యవస్థ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.ఈ వైఫల్యానికి జవాబుదారీతనం వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని,లేదా ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.పేపర్ లీకేజీ వ్యవహారంతో తీవ్ర మనస్తాపానికి గురై దాదాపు20నుండి30మంది విద్యార్థులు ఆత్మహత్య లు చేసుకున్నారని,ఈ మరణాలకు కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.?అనంతరం రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి మూల శోభన్ మాట్లాడుతూ...లడఖ్ ప్రాంతంలో నిరాహార దీక్ష చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త, విద్యావేత్త సోనమ్ వాంగ్‌చుక్ ఉద్యమానికి తమ సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ప్రకటించారు.?ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బోడెంకి చందు,జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాష్,అశోక్,పున్నం,అలాగే జిల్లా కమిటీ సభ్యులు రంజిత్ కుమార్,ధగాం రాజారాం తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ కార్మికులకు ప్రమాద బీమా అమలు చేయండి..



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,జులై23(సూర్యరేఖ)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా అమలు చేస్తున్న ప్రమాద జీవిత బీమా పథకం మిషన్ భగీరథ గ్రిడ్‌లో పనిచేస్తున్న(ఆపరేషన్ ఎండ్ మెయింటెనెన్స్) కార్మికులకు కూడా వర్తించాలని కోరుతూ గురువారం తెలంగాణ మిషన్ భగీరథ కార్మిక సమితి గౌరవ అధ్యక్షులు దుర్గం రఘునాథ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి,పంచాయతీ రాజ్ , గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క,పంచాయతీ రాజ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్‌లను కలిసి వినతిపత్రం సమర్పించారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ వినూత్న ప్రమాద బీమా పథకం ద్వారా ప్రమాదవశాత్తు ఉద్యోగి మరణించినపుడు వారి కుటుంబాలకు రూ.1 కోటి వరకు ఆర్థిక రక్షణ లభిస్తోంది.కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్,ఇతర తాత్కాలిక ఉద్యోగులతో పాటు బ్యాంకు ఖాతాల ద్వారా ప్రభుత్వ వేతనం పొందుతున్న వారందరికీ ఈ పథకం వర్తిస్తుందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. మిషన్ భగీరథ గ్రిడ్‌లో పనిచేస్తున్న ఓఎం కార్మికులు ప్రజలకు త్రాగునీటిని అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని,వారిలో చాలామంది ప్రమాదాలకు గురయ్యే అవకాశమున్న ఫీల్డ్ డ్యూటీలు,సంపుల్లో పనిచేస్తున్నందున వారికి కూడా ఇదే బీమా రక్షణ ఇవ్వడం న్యాయసమ్మతమని వినతిపత్రంలో కార్మిక సంఘ గౌరవ అధ్యక్షుడు దుర్గం రఘునాథ్ పేర్కొన్నారు.

## దేవాపూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన బెల్లంపల్లి ఏసీపీ



**బెల్లంపల్లి,జూలై23(సూర్యరేఖ)**వార్షిక తనిఖీల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్,బెల్లంపల్లి సబ్‌డివిజన్‌లోని దేవాపూర్ పోలీస్ స్టేషన్‌ను బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు.స్టేషన్ పరిసరాలతో పాటు కీలక రికార్డులు, శాంతిభద్రతలకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఫిర్యాదులు,కేసులను పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో పరిష్కరించాలని, సీసీటీఎన్ఎస్‌లో నమోదులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఆదేశించారు.కోర్టులతో సమన్వయం పెంచుకుని ఎక్కువ కేసుల్లో శిక్షలు అమలయ్యేలా కృషి చేయాలని సూచించారు.అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.తనిఖీలో మందమర్రి సీఐ పి. రమేష్,దేవాపూర్ ఎస్ఐ గంగారం పాల్గొన్నారు.

## భార్యను దారుణంగా హత్య చేసిన నిందితుడు మెండ సంతోష్ కు యావజ్జీవ శిక్ష...



**నాంపల్లి,హైదరాబాద్,జూలై23(సూర్యరేఖ)** నగరంలో మహిళల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ,తీవ్రమైన నేరాలకు పాల్పడిన నిందితుల కు చట్టప్రకారం కఠిన శిక్షలు పడేలా హైదరాబాద్ సిటీ పోలీస్ సమర్థవ ంతంగా వ్యవహరిస్తోందని కుల్సుంపురా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎ.రాములు తెలిపారు. కుల్సుంపురా పోలీస్ స్టేషన్ పరిధిలోని జియాగూడ సంజయ్ నగర్ కు చెందిన నిందితుడు మెండ సంతోష్ (32),వృత్తి టిఫిన్ సెంటర్ లేబర్ తన భార్య సరితతో గొడవపడి,ఆమెపై దాడి చేసి, కత్తెరతో తీవ్రంగా గాయపరిచి,దుపట్టాతో ఉరివేసి దారుణంగా హత్య చేశాడు.మృతురాలి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు15వ తేదీ జులై 2022న కుల్సుంపురా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.అప్పటి కుల్సుంపురా ఇన్ స్పెక్టర్, ప్రస్తుతం సిసిఎస్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్ ఈ కేసులో పక్కా సాక్ష్యాధారాలను సేకరించి, న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు.కేసు విచారణ జరిపిన నాంపల్లిలోని అదనపు సెషన్స్ న్యాయమూర్తి డి.బి.షీతల్ నిందితుడు మెండ సంతోష్ పై నేరం రుజువు కావడంతో యావజ్జీవ కారాగార శిక్ష,రూ.2,వెల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

## గొర్రెల దొంగతనం కేసులో నలుగురు నిందితుల అరెస్ట్:

సీఐ శ్రీనివాసరావు




**బెల్లంపల్లి,జూలై23(సూర్యరేఖ )** బెల్లంపల్లి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన గొర్రెల దొంగతనం కేసును పోలీసులు ఛేదించి నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.నిందితుల వద్ద నుంచి దొంగిలించిన గొర్రెతో పాటు దొంగతనానికి ఉపయోగించిన మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.బుడిదగడ్డ బస్తీకి చెందిన మహ్మద్ అబ్దుల్లాకు చెందిన గొర్రెలు,మేకలను ప్రతిరోజూ మేతకు తీసుకెళ్లే క్రమంలో ఈ నెల 20న సింగరేణి ఫంక్షన్ హాల్ సమీపంలో మేత మేస్తుండగా ఒక ఆడ గొర్రె కనిపించకుండా పోయింది.చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి ఉంటారని భావించిన బాధితుడు జూలై 21న బెల్లంపల్లి ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.దొంగిలించిన గొర్రె విలువ సుమారు రూ.10వేలుగా పేర్కొన్నాడు.ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు చంద్రవెల్లికి చెందిన మంచర్ల రమేష్,చాకేపల్లికి చెందిన కొట్ల వినోద్ కుమార్, చంద్రవెల్లికి చెందిన తిరుపతి గుజ్జ, మాలాగురిజాలకు చెందిన ఎడిగిరాల శంకర్‌లను అరెస్ట్ చేశారు.వారి వద్ద నుంచి దొంగిలించిన గొర్రెతో పాటు చోరీకి వినియోగించిన మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు.ప్రజల ఆస్తులను దొంగిలించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని, అలాంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీనివాసరావు హెచ్చరించారు.

## రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్..



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,జూలై23(సూర్యరేఖ)**మంచిర్యాల జిల్లా,జన్నారం మండలంలో గురువారం మొర్రిగూడ,పోనకల్ రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ రాములు ఆకస్మికంగా తనిఖీ చేశారు.రాఘవేంద్ర, రాజరాజేశ్వరి,శివసాయి రాఘవేంద్ర రైస్ మిల్ యజమానులతో ఆయన మాట్లాడుతూ... నిబంధనాల ప్రకారమే నడుచుకోవాలని ఎవరైనా నిబంధనలుపాటించని వారిపై చట్టరీత్యాచర్యలు ఉంటాయని ఆయన సూచించారు.ఆయన వెంట జన్నారం తహసిల్దార్ బక్కయ్య పాల్గొన్నారు

## ఈత మొక్కలు నాటిన ఎక్సైజ్ శాఖ..




**కామారెడ్డి,జూలై23(సూర్యరేఖ)**కామారెడ్డి జిల్లా ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి ముకుంద రెడ్డి ఆదేశాల మేరకు గురువారం రోజు కామారెడ్డి మండలంలోని గర్గుల్ గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా 2000ఈత మొక్కలు నాటారు.ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్ఐ విక్రమ్ కుమార్ మాట్లాడుతూ...ఈత చెట్టు నాటడం వల్ల గౌడ కులస్తులకు కులవృత్తిని అందిచడంతో పాటు పర్యావరణాన్ని కూడా తోడ్పాటు అందించడం జరుగుతుందని అదేవిధంగా కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో వివిధ మండలాల్లో ఈత ఖర్జూర చెట్లు నాటడం జరుగుతుందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు ఇట్టి కార్యక్రమంలో కామారెడ్డి ఎక్సైజ్ ఎస్సై విక్రం కుమార్,గ్రామ సర్పంచ్ దివ్య,టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్ మరియు గౌడ సంఘం నుంచి మొగుళ్ళ సాయగౌడ్,పెద్ద రాజాగౌడ్,మొగుళ్ళ రామాగౌడ్, గౌడ సభ్యులు,సిబ్బంది నరసింహులు,శరత్చంద్ర,దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ పేపర్ లీకేజీ ఘటనపై శంషాబాద్‌లో కాంగ్రెస్ నిరసన..

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్..



**శంషాబాద్,జులై23(సూర్యరేఖ)**ఢిల్లీలో నీట్ పేపర్ లీకేజీ వ్యవహారాన్ని నిరసిస్తూ,విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలు,వారికి మద్దతుగా వెళ్లిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అప్రజాస్వామికంగా అడ్డుకుని అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ శంషాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకమర్రి మహేందర్ ముదిరాజ్,సర్పంచుల సంఘం అధ్యక్షుడు, పాలమాకుల సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్,సర్పంచులు రవీ నాయక్,లింగం, ఆంజనేయులు,గోపాల్ నాయక్,లు మాట్లాడుతూ...నీట్ పేపర్ లీకేజీ ఘటనకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని,విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడిన ఈ ఘటనపై నైతిక బాధ్యత స్వీకరించి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అలాగే,విద్యార్థుల హక్కులను పరిరక్షించాల్సిన కేంద్ర ప్రభుత్వం వారిపై బలప్రయోగం చేయడం,వారికి సంఘీభావం తెలిపేందుకు వెళ్లిన రాహుల్ గాంధీని అడ్డుకుని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.ఈ నిరసన కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్,యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ దేవేందర్ నాయక్,ప్రభాకర్ యాదవ్,ఇంద్రారెడ్డి,బొబ్బిలి ఉమామహేశ్వర్,పత్తి నర్సింగ్‌రావు,సురేందర్ ,సిద్ధులు, రుక్మరాజ్, హమీ దుల్లానగర్ మాజీ సర్పంచ్ సతీష్ యాదవ్, ధయానంద్, మనోజ్ కుమార్,నరసింహ,బన్నీ,ఇమ్రాన్,అంజయ్య యాదవ్, రాజేష్ గౌడ్,ప్రభాకర్ గౌడ్,ప్రవీణ్,రఫిక్,శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలను సందర్శించిన సబ్ కలెక్టర్ ఉమాహారతి..

రిపేర్ పనుల నాణ్యతను పరిశీలన -విద్యార్థుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి



**నారాయణఖేడ్, జులై23(సూర్యరేఖ)**నారాయణఖేడ్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలిను గురువారం సబ్ కలెక్టర్ ఉమాహారతి సందర్శించారు.ఈ సందర్భంగా కళాశాలలో ప్రస్తుతం జరుగుతున్న రిపేర్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.పనుల్లో పాటిస్తున్న నాణ్యతను అధికారులతో కలిసి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.కాంట్రాక్టర్ హరి పనులను నాణ్యతాయుతంగా నిర్వహిస్తున్నారని సబ్ కలెక్టర్ అభినందించారు.అదే సమయంలో విద్యార్థులకు అవసరమైన చిన్నచిన్న మరమ్మతులు,సౌకర్యాలను వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుం డా పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ విద్యాసాగర్ రెడ్డి,గురుకుల కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవ సమితి కార్యాలయ ప్రారంభంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశిధర్,





గోల్కొండ--గోషామహల్ జిల్లా ఇన్‌చార్జ్ వై.శ్రీధర్

**రాజేంద్రనగర్,జులై23(సూర్యరేఖ)**గత 47 సంవత్సరాలుగా భాగ్యనగర్ సమితి ఆధ్వర్యంలో లోకమాన్య బాల గంగాధర్ తిలక్ స్ఫూర్తితో సామూహిక గణేష్ ఉత్సవాలను నిర్వహిస్తూ వస్తోందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శశిధర్,గోల్కొండ--గోషామహల్ జిల్లా ఇన్‌చార్జ్ వై.శ్రీధర్,లు అన్నారు.లోకమాన్య బాల గంగాధర్ తిలక్ 170వ జయంతి సందర్భంగా భాగ్యనగర్ గణేష్ చౌరస్తా సమితి ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవ సమితి కార్యాలయాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి వారు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,రాష్ట్ర భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు రాఘవ రెడ్డి,లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రతి ఏడాది జూలై 23న తిలక్ జయంతి సందర్భంగా కార్యాలయాన్ని ప్రారంభించి, వినాయక చవితి నుంచి అనంత చతుర్దశి వరకు ఆధ్యాత్మిక,సాంస్కృతిక,సామాజిక కార్యక్రమాలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు.లోకమాన్య తిలక్ ప్రారంభించిన సామూహిక గణేష్ ఉత్సవాలు సమాజంలో ఐక్యత, దేశభక్తి,సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నిలిచాయని అన్నారు.ఈ ఏడాది కూడా వినాయక చవితి నుంచి అనంత చతుర్దశి వరకు భక్తిశ్రద్ధలతో,శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు,కార్యకర్తలు,భక్తులు పాల్గొన్నారు.

## నేటి దర్నాచౌక్ ఇందిరాపార్క్ వద్ద జరుగు దర్నాను జయప్రదం చేద్దాం ..

జీవన్ సింగ్..



**నాంపల్లి,హైదరాబాద్,జూలై23(సూ ర్యరేఖ)**ఢిల్లీలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు,వాటిపై జరుగుతున్న ఆందోళనలనకు మద్దతు_గా భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమే రకు 24న ఉదయం 10 గంటలకు దర్నాచౌక్ ఇందిరాపార్క్ వద్ద దర్నాకు ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు ,మాజీ చైర్మన్లు ,మాజీ కార్పొరేటర్లు,నాయకులు ,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని కార్వాన్ నియోజకవర్గం భారత రాష్ట్ర సమితి పార్టీ ఇంచార్జి టీ.జీవన్ సింగ్ పిలుపునిచ్చారు.

## భర్త,అత్త వేధింపులతో ఓగృహిణి ఆత్మహత్య..



**రాజేంద్రనగర్,జూలై23(సూర్యరేఖ)** అత్త,భర్త వేదింపుల కారణంగా ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది.ఈ సంఘటన గురువారం బండ్లగూడ ఆదర్శనగర్ బస్తీలో చోటుచేసుకుంది. వివరాలను రాజేంద్రనగర్ ఎస్ఐ రాఘవేందర్ వెల్లడించారు.కర్ణాటక రాష్ట్రం సేడెం ప్రాంతానికి చెందిన ఆశమ్మ కూతురు శ్రీదేవి (25)ను ఆరు సంవత్సరాల క్రితం దామరగిద్ద ప్రాంతానికి చెందిన మహిపాల్ వివాహం చేసుకున్నాడు.వీరికి ముగ్గురు సంతానం.గత కొంత కాలంగా శ్రీదేవిని భర్త మహిపాల్,అత్త లక్ష్మీ,లు వేదిస్తున్నారు. మనస్తాపానికి గురైన శ్రీదేవి గురువారం మద్యాహ్నం ఇంట్లో రేకుల క్రింద వేసే ఇనుప రాడ్ కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్ఐ రాఘవేందర్ మృతదేహాన్ని పోస్టుమార్థం నిమిత్తం ఉస్మానియా మార్చ్యురీకి తరలించారు .ఆత్మహత్య చేసుకున్న శ్రీదేవి తల్లి ఆశమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సర్ ప్రక్రియను విజయవంతం చేయాలి:

జనసేన నేత శ్రీనివాస్.



**నిజామాబాద్,జులై23(సూర్యరేఖ)** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్--సర్)కా ర్యక్రమాన్ని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం లో 100శాతం విజయవంతంగా పూర్తి చేయాలని జనసేన పార్టీ నిజామాబాద్ రూరల్ నాయకుడు శ్రీనివాస్ అన్నారు.నిజా మాబాద్ రూరల్ నియోజకవర్గంలో 94శాతం ఓటర్ మ్యాపింగ్ పూర్తైందని,మిగిలిన ప్రక్రియను కూడా వేగవంతంగా పూర్తి చేసి ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు అత్యంత విలువైనదని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా బిఎల్ఎలు అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. జనసేన పార్టీ కార్యకర్తలు ప్రత్యేకంగా పాల్గొనాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

## గ్రీన్‌వుడ్ సీబీఎస్ఈ పాఠశాలలో ఉచిత మెగా దంత వైద్య శిబిరం..




**మందమర్రి,జూలై23(సూర్యరేఖ)** మందమర్రి మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న గ్రీన్‌వుడ్ సీబీఎస్ఈ పాఠశాలలో గురువారం విద్యార్థులు,వారి తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల కోసం ఉచిత మెగా దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.మంచిర్యాలకు చెందిన శ్రీకాంత్ డెంటల్ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పాల్గొన్న వారికి ఉచిత దంత పరీక్షలు నిర్వహించి,దంత ఆరోగ్య పరిరక్షణ,నోటి పరిశుభ్రత, దంత సమస్యల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ భరద్వాజ్ నాయుడు, ఏజీఎం పవన్ కుమార్ మాట్లాడుతూ...విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే దంత ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని తెలిపారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్, హెడ్‌మిస్ట్రెస్ క్రిస్టినా,వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి,ఏవో ఖుద్దూస్,డాక్టర్ శ్రీకాంత్,డాక్టర్ సుమలతతో పాటు విద్యార్థులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి:

ఆదం సంతోష్ కుమార్

రాహుల్ గాంధీపై పోలీసుల చర్యను ఖండిస్తూ ఆదాం సంతోష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శాంతియుత నిరసన ర్యాలీ







**సికింద్రాబాద్,జూలై23(సూర్యరేఖ)**ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్–యుజి ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంపై విద్యార్థులు చేపట్టిన శాంతియుత నిరసనకు సంఘీభావం తెలిపిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై పోలీసులు వ్యవహరించిన తీరును ఖండిస్తూ,సికింద్రాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం సీతాఫల్మండి అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు భారీ ఎత్తున శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ విగ్రహం వరకు సాగిన ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, రాహుల్ గాంధీ పై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ...నీట్–యుజి ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనలు దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయని అన్నారు.పేపర్ లీకేజీలకు కారణమైన అసలు సూత్రధారులను గుర్తించి ఇప్పటి వరకు కఠిన చర్యలు తీసుకోకపోవడం కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు.వైద్య విద్యలో ప్రవేశం కోసం విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి చదువుతున్నారని,తల్లిదండ్రులు లక్షల రూపాయలు ఖర్చు చేసి కోచింగ్ ఇప్పిస్తున్నారని తెలిపారు.రాత్రింబవళ్లు శ్రమించి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల జీవితాలతో కొందరు అక్రమాలకు పాల్పడుతూ చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల సమస్యలను ప్రస్తావిస్తూ శాంతియుతంగా నిరసన తెలిపిన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై పోలీసులు బలప్రయోగం చేసి అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న వారిపై ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, నీట్–యుజి ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి,భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పారదర్శకమైన పరీక్షా వ్యవస్థను అమలు చేయాలని ఆదం సంతోష్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో రాజేందర్ యాదవ్, శిల్పాచారి,డివిజన్ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే ఘటనలపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ప్రజల భద్రతకు సీసీ కెమెరాలు తప్పనిసరి..



డీసీపీ ఏ.భాస్కర్



**మంచిర్యాల,జూలై23(సూర్యరేఖ)** ప్రజల ప్రాణ,ఆస్తి భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ అన్నారు.రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో భాగంగా నగల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యాపార సంస్థల్లో భద్రతా ప్రమాణాలు, సీసీ కెమెరాల ఏర్పాటు,దొంగతనాల నివారణ చర్యలపై వ్యాపారులకు అవగాహన కల్పించారు. మంచిర్యాల నగరం పారిశ్రామిక,వాణిజ్యపరంగా కీలక కేంద్రంగా ఉండటంతో పాటు మహారాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ఉండడం, రైల్వే మార్గంలో అధిక రాకపోకలు ఉండడం వల్ల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత అవసరమని డీసీపీ తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సేఫ్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ చట్టం ప్రకారం ప్రతి వ్యాపార సంస్థ,ప్రజలకు సేవలు అందించే కార్యాలయాలు, బ్యాంకులు, లాడ్జీలు,హోటళ్లు, షాపింగ్ సముదాయాలు,ఇతర వాణిజ్య సంస్థల్లో తప్పనిసరిగా నాణ్యమైన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.ఆధునిక పద్ధతుల్లో నేరాలకు పాల్పడుతున్న నేరస్థులను వేగంగా గుర్తించేందుకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.రైల్వే మార్గం ద్వారా నగరంలోకి ప్రవేశించి నేరాలకు పాల్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని మంచిర్యాల, నస్పూర్,శ్రీరాంపూర్,రామకృష్ణాపూర్ ప్రాంతాల్లో 24 గంటల పాటు ప్రత్యేక ఆర్మ్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజలు పోలీసులకు సహకరిస్తూ తమ నివాసాలు,వ్యాపార సంస్థలు, వాణిజ్య సముదాయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డీసీపీ ఏ.భాస్కర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ ప్రకాష్,ఇన్‌స్పెక్టర్ ప్రమోద్‌రావు,ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ సమస్యలపై సింగరేణి జీఎంకు చైర్‌పర్సన్,కౌన్సిలర్ల వినతి



**బెల్లంపల్లి,జులై23(సూర్యరేఖ)** బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న పలు ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ దావా స్వాతి, కౌన్సిలర్లు గురువారం మందమర్రి సింగరేణి ఏరియా జీఎం రాధాకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజల సౌకర్యార్థం ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రజా మరుగుదొడ్డి నిర్మాణానికి అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరారు.అలాగే 29వ వార్డులో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిన నిరుపయోగ వాటర్ ట్యాంక్‌ను వెంటనే కూల్చివేసేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నిలిచిపోయిన సింగరేణి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని కోరారు.ప్రజల భద్రత, పారిశుధ్యం,మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని జీఎంకు వివరించారు.సమస్యలను పరిశీలించిన జీఎం రాధాకృష్ణ సంబంధిత అంశాలపై తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు మున్సిపల్ ప్రతినిధులు తెలిపారు.

## మేడ్చల్ నూతన సీఐ అంజిరెడ్డికి కాంగ్రెస్ నాయకుల ఘన సన్మానం..



**మేడ్చల్,జూలై 23(సూర్యరేఖ)**మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అంజిరెడ్డిని గుండ్లపోచంపల్లి 299డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... నూతన సీఐ అంజిరెడ్డి ప్రజలకు మరింత సమర్థవంతమైన,పారదర్శకమైన పోలీసు సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని కోరారు.అలాగే ఆయన తన కొత్త బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్, గుండ్లపోచంపల్లి మాజీ సర్పంచ్ బండారి నరేందర్ ముదిరాజ్,గుండ్లపోచంపల్లి డివిజన్ ఎస్సీసెల్ అధ్యక్షులు కుండ భానుచందర్,బండారి అనిల్, లేబర్ సెల్ అధ్యక్షులు కావాలి భాస్కర్,ఒడ్డె ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ సర్కిల్ అభివృద్ధికి రూ. 9.58 కోట్ల నిధులు మంజూరు



**మేడ్చల్,జూలై23(సూర్యరేఖ)** మేడ్చల్ మున్సిపాలిటీ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో విలీనమైన అనంతరం తొలిసారిగా అభివృద్ధి పనుల కోసం రూ.9.58కోట్ల నిధులు మంజూరయ్యాయి.ఈ నిధులతో మేడ్చల్, పూడూరు––కిష్టాపూర్, గుండ్లపోచంపల్లి డివిజన్లలో పలు మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుదాంష్ తెలిపిన వివరాల ప్రకారం...ఈ నిధులను సీసీ రోడ్ల నిర్మాణం,మూత్రశాలల ఏర్పాటు, బోర్‌వెల్‌ల మరమ్మత్తులు,బోనాల పండుగ నిర్వహణతో పాటు ఇతర ప్రజా అవసరాల పనుల కోసం వినియోగించనున్నారు.నిధుల కేటాయింపులో భాగంగా పూడూరు––కిష్టాపూర్ డివిజన్‌కు రూ. 3.80 కోట్లు,మేడ్చల్ డివిజన్‌కు రూ.3.48 కోట్లు, గుండ్లపోచంపల్లి డివిజన్‌కు రూ.2.27 కోట్లు మంజూరయ్యాయి .సీఎంసీలో విలీనమైన తర్వాత మొదటిసారిగా భారీ స్థాయిలో అభివృద్ధి నిధులు విడుదల కావడంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ నిధులతో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల సమస్యలు పరిష్కారమై,ప్రాంత అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వ అణచివేతను ఖండిస్తూ నేడు బీఆర్ఎస్వీ భారీ నిరసన

ఇందిరా పార్క్ ధర్నాచౌక్‌కు విద్యార్థులు,యువత భారీగా తరలిరావాలని

కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్వీ నాయకుడు యాదగిరి భాస్కర్ పిలుపు



**రాజేంద్రనగర్,జులై23 (సూర్యరేఖ)** ఢిల్లీలో ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన వ్యక్తంచేస్తున్న విద్యార్థులు,యువతపై కేంద్ర ప్రభుత్వం అక్రమ అరెస్టులు,దౌర్జన్యాలు ,అణచివేత చర్యలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ )ఆధ్వర్యంలో గురువారం ఇందిరా పార్క్ ధర్నాచౌక్‌లో భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్వీ నాయకుడు యాదగిరి భాస్కర్ అన్నారు.ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించనున్నారని వెల్లడించారు.విద్యార్థుల హక్కుల పరిరక్షణకు మద్దతుగా నిర్వహిస్తున్న ఈ నిరసనలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్వీ నాయకుడు యాదగిరి భాస్కర్ మాట్లాడుతూ..విద్యార్థుల గొంతును అణిచివేసే కేంద్ర ప్రభుత్వ వైఖరి ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థి లోకానికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.కాటేదాన్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్వీ నాయకులు,విద్యార్థి సంఘాల ప్రతినిధులు ,యువత,విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై ఈ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యాదగిరి భాస్కర్ కోరారు.

# గగన్‌పహాడ్ లో అన్యాక్రాంతమవుతున్న చెరువులపై హైడ్రా దృష్టి







**శీలం తిరుపతి రెడ్డి ఫిర్యాదుతో క్షేత్రస్థాయిలో పరిశీలన..**

**త్వరలో ఆక్రమణలపై చర్యలు..?**

**రాజేంద్రనగర్,జులై23(సూర్యరేఖ):** రాజేంద్రనగర్ జోనల్ గగన్‌పహాడ్ పరిధిలోని చెరువులను సంరక్షించాలని సామాజిక కార్యకర్త శీలం తిరుపతి రెడ్డి చూపిన చొరవకు అధికార యంత్రాంగం కదిలింది.చెరువులను ఆక్రమిస్తున్నారని ఆరోపిస్తూ శీలం తిరుపతిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదుకు హైడ్రా అధికారులు స్పందించారు.ఆక్రమణలపై స్థానిక చేసిన ఫిర్యాదుతో హైడ్రా అధికారులు రంగంలోకి దిగారు.ఇటీవల ప్రజావాణి కార్యక్రమంలో అందిన ఫిర్యాదుల మేరకు బుధవారం ప్రెస్టీజ్ పెద్ద చెరువు,మామిడికుంట చెరువు,అప్పా చెరువు,బ్రాహ్మణ చెరువులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుల ప్రస్తుత పరిస్థితి,హద్దులు, ఆక్రమణలు, ఇతర అంశాలను అధికారులు నిశితంగా పరిశీలించారు.ఇప్పటికే పలు చెరువుల్లో జరిగిన ఆక్రమణలను గుర్తించినట్లు సమాచారం.సమగ్ర నివేదికను సిద్ధం చేసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు త్వరలో సమర్పించనున్నట్లు తెలుస్తుంది.ఈ పరిశీలనలో హైడ్రా ఏసీపీ శ్రీకాంత్ రెడ్డి,డీఈ అన్నాజీ రావు,ఇన్‌స్పెక్టర్ సైదులు తదితర అధికారులు పాల్గొన్నారు.

**శీలం తిరుపతిరెడ్డి ఫిర్యాదుకు కదిలిన యంత్రాంగం...!**

ఇటివల ప్రజావాణిలో స్థానికులు శీలం తిరుపతి రెడ్డి సమర్పించిన ఫిర్యాదుపై అధికారులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. అధికారుల నివేదిక ఆధారంగా చెరువుల ఆక్రమణలను తొలగించి,ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు చెరువుల హద్దులను ఖరారు చేసి ఫెన్సింగ్ ఏర్పాటు చేసే అవకాశాలు ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది.దీంతో చెరువులను ఆక్రమించిన భూకబ్జాదారుల్లో ఆందోళన నెలకొంది.హైడ్రా చేపట్టనున్న తదుపరి చర్యలపై స్థానికంగా ఉత్కంఠ నెలకొంది.

## ఫస్ట్...లాస్ట్... తెలంగాణనే

**హైదరాబాద్ :** కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పెర్ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 2.0 నివేదికలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మిశ్రమ ఫలితాలను సాధించింది. ఓవరాల్ నేషనల్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ గణనీయమైన పురోగతిని సాధించి, గతంలో ఉన్న స్థానం నుంచి ఏకంగా 18వ స్థానానికి చేరింది. మొత్తం 1000 పాయింట్లకు గాను 599.7 స్కోరు సాధించి ప్రచేష్ట-3 బ్యాండ్‌లో నిలిచింది. స్కూళ్లకు విద్యార్థుల రాక , అడ్మిషన్ల ప్రక్రియలో సాధించిన ప్రగతి వల్లనే రాష్ట్రం ఓవరాల్ ర్యాంకింగ్‌లో పైకి ఎగబాకినట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది.అయితే ర్యాంక్ మెరుగైనప్పటికీ అసలైన చదువుల నాణ్యతలో మాత్రం తెలంగాణ ఘోరంగా విఫలమైంది. విద్యార్థుల సామర్థ్యం, అధ్యయన ఫలితాలు.. అంటే లెర్నింగ్ ఔట్ కమ్ విభాగంలో రాష్ట్రం అత్యంత పేలవ ప్రదర్శన కనబరిచింది. ఈ విభాగానికి కేటాయించిన 240 మార్కులకు గాను తెలంగాణ కేవలం 69 మార్కులు (28.8%) మాత్రమే సాధించి, జాతీయ స్థాయిలో 26వ స్థానంలో నిలిచింది. తరగతి గదిలో బోధన, విద్యార్థుల్లో కనీస అక్షరాస్యత మరియు సంఖ్యా శాస్త్ర సామర్థ్యాలు ఇంకా తీవ్ర ఆందోళనకరంగానే ఉన్నాయని ఈ అంకెలు తేటతెల్లం చేస్తున్నాయి.మరోవైపు పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత కూడా విద్యాశాఖను వేధిస్తోంది.ఇన్ఫ్రాస్ట్రక్చర్ విభాగంలో కేటాయించిన 190 మార్కులకు 91.9 మార్కులు సాధించి రాష్ట్రం 20వ స్థానంలో నిలిచింది. పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికీ తాగునీరు, సరైన శౌచాలయాలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో కేవలం ఓవరాల్ ర్యాంకింగ్‌పై మాత్రమే దృష్టి పెట్టకుండా, నాణ్యమైన విద్యనందించడంతో పాటు టీచర్ల శిక్షణ, మౌలిక వసతుల కల్పనపై విద్యాశాఖ తక్షణమే ప్రత్యేక శ్రద్ధ వహించాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

## యూత్ కాంగ్రెస్ అందోళన

## ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దగ్ధం

**రామడుగు :** నీట్ పేపర్ లీక్ ఘటనను నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ రామడుగు మండల అధ్యక్షుడు అనుపురం పరుశురాం గౌడ్ ఆధ్వర్యంలో గురువారం రామడుగు మండల కేంద్రంలో ప్రధాన మంత్రి మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా అనుపురం పరుశురాం గౌడ్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీక్ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల కష్టాన్ని, వారి కలలను నీరుగార్చే విధంగా జరిగిన ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పరీక్షల నిర్వహణలో పూర్తిగా విఫలమైందని విమర్శిస్తూ నీట్ పేపర్ లీక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను వెంటనే శిక్షించాలని కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం డైరెక్టర్ మామిడి దిలీప్ కుమార్ యూత్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ మల్యాల అక్షయ్ కుమార్ మిల్కీ సోషల్ మీడియా యూత్ కాంగ్రెస్ రంగు శ్రీనివాస్ బీమా ఈశ్వర్ అనుపూరం సంజీవ్ భువన్ కుమార్ యువజన కాంగ్రెస్ కార్యకర్తలు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## కేటీఆర్ జన్మదిన వేడుకలు

## రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

**పెద్దపల్లి :** రాష్ట్ర సాధనలో, రాష్ట్ర భవిష్యత్తును టెక్నికల్, పారిశ్రామిక రంగాలలో అగ్రగామిగా నిలపడంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మాజీ మంత్రి కల్వకుం ట్ల తారక రామారావు చేసిన కృషి చిరస్మరణీయమ ని టీఎస్టీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమిల్ల రాకేష్ కుమార్ కొనియాడారు. కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలను

## నీట్ పేపర్ లీకేజీ పేరుతో దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించొద్దు

**సామాజిక కార్యకర్త రాము ముదిరాజ్**



**నారాయణపేట, జులై23(సూర్యరేఖ )**నీట్ పేపర్ లీకేజీ అంశంపై దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న నిరసన కార్యక్రమాలు ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా నిర్వహించాలని, దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలకు ఎవరూ పాల్పడవద్దని సామాజిక కార్యకర్త రాము ముదిరాజ్ కోరారు.ఈ మేరకు ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాట్లాడుతూ..ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనల సందర్భంగా కొందరు మహిళలు,మీడియా ప్రతినిధులు,పోలీసుల పట్ల వ్యవహరించిన తీరు దేశ గౌరవాన్ని దెబ్బతీసేలా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.నిరసనల పేరుతో పోలీసులపై దాడులు చేయడం వంటి చర్యలు దేశ అభివృద్ధికి ఆటంకం కలిగించేలా ఉన్నాయని అన్నారు.విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం గాంధేయ మార్గంలో శాంతియుతంగా ఉద్యమాలు నిర్వహించాలని,విద్యార్థి సంఘాలతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ డిమాండ్లను వినిపించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రేరేపణకు లోనుకాకుండా విద్యార్థులు విజ్ఞతతో వ్యవహరించాలని,ఏ కార్యక్రమంలో పాల్గొనే ముందు దాని పర్యవసానాలను ఆలోచించాలని సూచించారు.అదే సమయంలో విద్యార్థుల నిరసనల సందర్భంగా పోలీసులు కూడా సంయమనంతో వ్యవహరించాలని రాము ముదిరాజ్ అభిప్రాయపడ్డారు.పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడే వారిపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకువచ్చి,నిందితులకు కఠిన శిక్షలు విధించేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## బోనాల ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి..

**ప్రగతి కాలనీలో ఆలయాల ఏర్పాట్లను పరిశీలనలో తోకల శ్రీనివాస్ రెడ్డి**



**రాజేంద్రనగర్,జులై23(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రగతికాలనీలో నిర్వహించనున్న బోనాల మహోత్సవాల ఏర్పాట్లను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు,రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి బుధవారం పరిశీలించారు.ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులతో కలిసి ఆలయాల్లో జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించిన ఆయన,డివిజన్ పరిధిలోని అన్ని దేవాలయాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో,వైభవంగా నిర్వహించేందుకు పారిశుద్ధ్యం, తాగునీరు,విద్యుత్,భద్రత తదితర అన్ని వసతులను కల్పించాలని సూచించారు.పండుగ ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ఆలయాలను సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు ఆర్.కృష్ణ యాదవ్,రావుల భాస్కర్, ప్రతాప్ రెడ్డి,దాసు,చిన్న అక్కెం జంగయ్య యాదవ్,సురేష్ ముదిరాజ్‌తో పాటు దేవాలయ కమిటీ సభ్యులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అడవి పందిని హతమార్చిన కేసులో 32మందిపై కేసు నమోదు.



**బెల్లంపల్లి,జులై23(సూర్యరేఖ)** అడవి పందిని హతమార్చి మాంసాన్ని పంచుకున్న ఘటనలో 32మందిపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేశారు.అందిన సమాచారం మేరకు భీమిని మండలం ఖర్జి భీంపూర్ గ్రామానికి చెందిన బామిని నగేష్ ఇంట్లో అటవీశాఖ అధికారులు సోదాలు నిర్వహించగా అడవి పంది మాంసం లభ్యమైంది. నగేష్‌ను విచారించగా, కుక్కల దాడిలో మృతి చెందిన అడవి పందిని ఖర్జి భీంపూర్ గ్రామానికి చెందిన 9మంది,నార్లపూర్ గ్రామానికి చెందిన14 మంది,రాజారం గ్రామానికి చెందిన 6మంది, పైకాజిగూడకు చెందిన 3మంది కలిసి కోసుకుని మాంసాన్ని పంచుకున్నట్లు వెల్లడించాడు.దీంతో మొత్తం 32మందిని అదుపులోకి తీసుకున్న అటవీశాఖ అధికారులు వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి తదుపరి విచారణ కోసం బెల్లంపల్లి రేంజ్ కార్యాలయానికి తరలించారు.ఈ దాడిలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.గౌరీశంకర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ టి.గోపికృష్ణ పాల్గొన్నారు.

## నిలిచిపోయిన ఊరు-వాడ

**హైదరాబాద్ :** వంద కోట్లతో సోషల్ సర్వీస్ చేస్తాం? గ్రామాలను తీర్చిదిద్దుతాం? ప్రజాసమస్యలను పాలకుల దగ్గరకు చేరుస్తామంటూ భారీ ఎలివేషన్లు ఇచ్చిన సంస్థ.. షట్‌డౌన్ చేస్తున్నట్టు సంచలన ప్రకటన చేసింది. అసలింతకి ఏం జరిగింది?? ఎన్టీఆర్ చెప్పినా ప్రజాసేవ ఆపేదేలేదన్న నిర్వాహకులు ఎందుకు వెనక్కి తగ్గారు?? కావాలనే ఆగిపోయారా?? ఎవరైనా ఆపేశారా?? అనేది సంచలనంగా మారింది.. సోషల్ మీడియా సెన్సేషన్.. రా ఎన్టీఆర్ సంస్థ బుధవారం సడెన్‌గా యూటర్న్ తీసుకుంది. తమ సేవలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ఎక్స్‌లో ప్రకటించడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. అయితే ఇది ఎన్టీఆర్ అభిమానుల ఒత్తిడితో జరిగిందా?? లేక ఎన్టీఆర్ ఆఫీస్ నుంచి డైరెక్ట్ మెసేజ్ ఏమైనా వెళ్లిందా?? లేకపోతే మరెవరి ప్రమేయమైనా ఉందా?? అన్న చర్చ సోషల్ మీడియాలో రచ్చ లేపుతోంది. రా ఎన్టీఆర్ సంస్థను నిలిపివేస్తున్నామని చెప్పడంతో పాటు? ఇందులో విషయం సాధించిన వారందరికి అభినందనలని ఫినిషింగ్ టచ్ ఇవ్వడం సరికొత్త చర్చకు తెరలేపింది. ఊరు?వాడ పేరుతో సుమారుగా 100 కోట్ల సేవా యజ్ఞం చేపడుతున్నట్టు రా ఎన్టీఆర్ సంస్థ ఆర్గనైజర్ సాయి రూప్ ఓ సంచలనమే సృష్టించారు. ఫ్యాన్స్ వద్దన్నా? తమ హీరో ప్రతిష్ట దెబ్బతింటుందని పలువురు కంప్లైంట్ చేసినా? రా ఎన్టీఆర్‌తో తమకు ఎలాంటి సంబంధం లేదని ఎన్టీఆర్ ఆఫీస్ నుంచి అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చినా ఏమాత్రం తగ్గకుండా ఈనెల 18న తిరుపతిలో మీటింగ్ పెట్టి తమ అజెండా ఏంటో వివరించారు సంస్థ ఆర్గనైజర్ సాయిరూప్. అభిమాని అంటే నలుగురికి ఉపయోగపడాలి అనే ఎన్టీఆర్ మాటను దృష్టిలో పెట్టుకొనే సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఎవరు అడ్డొచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా సేవ చేస్తామని రా ఎన్టీఆర్ సంస్థకు భారీ ఎలివేషన్లిచ్చారు. కట్ చేస్తే? క్లోజ్ బటన్ నొక్కి ఇప్పుడందరిని షాక్‌కు గురిచేశారు.అయితే? ఎందుకు వెనక్కి తగ్గారో, సంస్థను ఎందుకు మూసివేస్తున్నారో అన్న విషయాలపై రా ఎన్టీఆర్ నిర్వాహకులు ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. కానీ 100 కోట్లు నిధులు ఎక్కడి నుంచి వస్తాయి అన్న ప్రశ్నలకు సాయి రూప్ దగ్గర స్పష్టమైన సమాధానం లేకపోవడం, ఫలితంగా పెద్దఎత్తున విమర్శలు రావడమూ ఓ కారణంగా చర్చించుకుంటున్నారు.

## అవినీతి అనకొండే...

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లో ట్రాన్స్‌కో డీఈ ముత్యం వెంకటరమణపై ఏసీబీ దాడులు నిర్వహించి ఆదాయానికి మించిన ఆస్తులను భారీగా గుర్తించింది. 9 ప్రాంతాల్లో జరిగిన సోదాల్లో కిలోల కొద్దీ బంగారం.. భారీగా డబ్బు, విలువైన ఆస్తులు, కార్లు, కమర్షియల్ భవనాలు, అపార్ట్‌మెంట్లకు సంబంధించిన పత్రాలు బయటపడ్డాయి. గతంలో లంచం కేసులోనూ అరెస్టైన వెంకటరమణను ఈసారి అక్రమాస్తుల కేసులో అరెస్ట్ చేశారు. ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్న పత్రాల ఆధారంగా ఏసీబీ అధికారులు మరింత లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.తెలంగాణలో అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. దీంతో లంచాలు తీసుకుని అక్రమాస్తులు కూడబెట్టిన అధికారులు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ట్రాన్స్‌కో డిప్యూటీ ఇంజనీర్ (డీఈ) ముత్యం వెంకటరమణ.. ఏసీబీ అధికారులకు చిక్కారు. భారీగా అక్రమాస్తులు గుర్తించడంతో.. ఆయనను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని నివాసంతో పాటు ఆయనకు సంబంధించిన మొత్తం తొమ్మిది ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. దాదాపు 12 గంటల పాటు సాగిన ఈ తనిఖీల్లో భారీ ఎత్తున అక్రమాస్తులు వెలుగులోకి రావడంతో వెంకటరమణను అధికారులు అరెస్ట్ చేశారు.ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ముత్యం వెంకటరమణ ఆదాయానికి మించి రూ.27.65 కోట్ల విలువైన ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఈ విలువ లెక్కించగా.. బహిరంగ మార్కెట్‌లో ఆస్తుల విలువ రూ. వందల కోట్లలో ఉండే అవకాశముందని ఏసీబీ అధికారులు భావిస్తున్నారు.ఈ ఏసీబీ అధికారుల సోదాల్లో 2 కిలోలకు పైగా బంగారు ఆభరణాలతోపాటు.. రూ.52 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు.. వజ్రాభరణాలు, విలువైన ఎలక్ట్రానిక్ వస్తువులు, విదేశీ మద్యం సీసాలు సీజ్ చేశారు. కియా, మహీంద్రా, బలెనో కంపెనీలకు చెందిన 3 కార్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.అంతేకాకుండా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి ప్రాంతాల్లో నివాస ఫ్లాట్లు, కమర్షియల్ భవనాలు, గుట్టల బేగంపేట్‌లో జీ+5 భవనం, మూసాపేట్‌లో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న 10 అపార్ట్‌మెంట్లతో పాటు ముత్యం వెంకటరమణ భార్య స్వప్న పేరుతో నిర్మాణ రంగంలో భారీ పెట్టుబడులు ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు.ప్రస్తుతం రెన్యూవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (రెడ్కో)లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ముత్యం వెంకటరమణ.. గతంలో కూడా 2019లో లంచం కేసులో ఏసీబీకి చిక్కిన విషయం వెలుగులోకి వచ్చింది. అప్పటి నుంచి ఆయనపై నిఘా కొనసాగించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పత్రాలు, బ్యాంకు ట్రాన్సాక్షన్లు, స్థిరాస్తుల రికార్డులను పరిశీలిస్తూ.. ముత్యం వెంకటరమణ అక్రమాస్తుల కేసులో మరింత లోతుగా దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు.

## శాన్వి డిఫెన్స్ అకాడమీ సేవలు అభినందనీయం

## మేయర్ కోలగాని శ్రీనివాస్

**కరీంనగర్ :** విద్యార్థులకు విద్యతో పాటు దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని పెంపొందిస్తూ దేశ సేవ దిశగా తీర్చిదిద్దుతున్న శాన్వి జూనియర్ కళాశాల ఉ డిఫెన్స్ అకాడమీ అభినందనీయమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. "కమ్ టు లెర్న్? గో టు సర్వ్" అనే నినాదంతో యువతను సైన్యం, రక్షణ రంగం, సామాజిక సేవ వైపు ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. కళాశాల నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మేయర్, విద్యార్థులు కష్టపడి, క్రమశిక్షణతో లక్ష్యాలను సాధించాలని సూచించారు. సామాజిక కార్యకర్త అరెశెట్టి మునిందర్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాటారంలో కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరసన

**జయశంకర్ భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం చౌరస్తాలోని డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ కాటారం మండల అధ్యక్షులు వేమునూరి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలపై శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమునూరి ప్రభాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ...కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఆయన చేసిన కీలక వ్యాఖ్యలు ఇలా ఉన్నాయి నీట్ (ఔఇఖ) పేపర్ లీక్ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారినా, కేంద్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. బాధ్యత వహించాల్సిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఇప్పటివరకు రాజీనామా చేయకపోవడం సిగ్గుచేటని, దీనిపై బీజేపీ నాయకులు మౌనం వహించడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, ఏఐసీసీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా తదితరులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే, వారిపై దాడులు చేసి అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హత్య అన్నారు. రాహుల్ గాంధీ కుటుంబం ఈ దేశం కోసం ప్రాణాలర్పించిందని, అలాంటి కుటుంబానికి చెందిన నాయకులపై విచక్షణ కోల్పోయి లాఠీచార్జ్ చేయడం హేయమైన చర్య అని మండిపడ్డారు. బీజేపీ నేతల తీరుపై ధ్వజమెత్తుతూ దేశంలో యువత తమ హక్కుల కోసం పోరాడుతుంటే వారిని "దేశద్రోహులు"గా చిత్రీకరిస్తూ, మతం పేరుతో లబ్ధి పొందాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ బీజేపీ నాయకులు విద్యార్థుల సమస్యలపై నోరు మెదపకుండా మౌనం వహించడం సిగ్గుచేటన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వి హింసాత్మక రాజకీయాలు:

## బీజేపీ నేత సునీల్ రావు

**కరీంనగర్ :** నీట్ పరీక్షను సాకుగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆరోపించారు. గురువారం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్షలపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ, కాంగ్రెస్ రాజకీయ లబ్ధి కోసం ఆందోళనలను రెచ్చగొడుతోందని విమర్శించారు. పార్లమెంట్, పోలీసులపై దాడులు చేయడం ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళన కాదని అన్నారు. పోటీ పరీక్షల లీకేజీలపై కాంగ్రెస్ గత పాలనలో ఎవరైనా మంత్రులు రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా జాబ్ క్యాలెండర్, ఉద్యోగాల హామీల అమలు ఎక్కడుందని నిలదీశారు. ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా చర్చించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని, హింసాత్మక చర్యలను మాత్రం సహించబోమని సునీల్ రావు హెచ్చరించారు.

## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**కరీంనగర్ :** నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును ఖండిస్తూ కరీంనగర్‌లోని 35, 36, 55 డివిజన్ల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. మారుతి నగర్, కాపువాడ ప్రధాన చౌరస్తా వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడితే చూస్తూ ఊరుకోబోమన్నారు. విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుందని దొంతి గోపి, ఎం.డి. ఇర్షాద్ అలీ, మాదాసు శ్రీనివాస్ తెలిపారు.

## దెయ్యమై కుటుంబాన్ని బాగా చూసుకుంటా...

**హైదరాబాద్ :** తెలంగాణ డీజీపీ కార్యాలయంలో షాకింగ్ ఘటన వెలుగు చూసింది. డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న స్వామి ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు కోల్పోయారు. బుధవారం రాత్రి విధుల్లో ఉన్న స్వామి.. గురువారం ఉదయం సుమారు 5.30 గంటల సమయంలో కార్యాలయ ప్రాంగణంలోని వాష్‌రూమ్‌లోకి వెళ్లి .. తన వద్ద ఉన్న సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ప్రాణాలు కోల్పోయారు. ఒక్కసారిగా తుపాకీ శబ్దం వినిపించడంతో అక్కడి సిబ్బంది పరుగెత్తుకుంటూ వెళ్లగా, స్వామి రక్తపు మడుగులో పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు.

# హరీష్ ఇంపాక్ట్ ...

# పాదయాత్రలో తగ్గని క్రేజ్

**మెదక్ :** తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా, గ్రౌండ్ లెవల్ మాస్ లీడర్‌గా చెరగని ముద్ర వేసుకున్న మాజీ మంత్రి హరీష్ రావు వైఖరి ఇప్పుడు గులాబీ శ్రేణుల్లోనే కాకుండా, ప్రత్యర్థి వర్గాల్లోనూ తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. సిద్దిపేట జిల్లా మండల స్థాయిలో హరీష్ రావు చేపట్టిన 15 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్రకు రైతులు, ప్రజల నుంచి ఊహించని స్థాయిలో అపూర్వ స్పందన లభించింది. కాళేశ్వరం పంపులను వెంటనే ప్రారంభించి, గోదావరి జలాలతో రంగనాయక సాగర్‌ను నింపాలని డిమాండ్ చేస్తూ ఆయన నిర్వహించిన ఈ యాత్ర.. కేవలం ఒక మండల స్థాయి నిరసనలా కాకుండా, ఒక రాష్ట్ర స్థాయి ప్రజా ఉద్యమాన్ని తలపించేలా జనసందోహాన్ని ఆకర్షించింది. కేవలం ఒక మండల స్థాయిలోనే హరీష్ పిలుపునకు ఈ స్థాయిలో జనం తరలివస్తే.. ఒకవేళ ఇదే పాదయాత్రను ఆయన నియోజకవర్గ స్థాయికో లేక రాష్ట్ర స్థాయికో విస్తరిస్తే ఉండే మాస్ ఇంపాక్ట్ ఎలా ఉంటుందనే చర్చ పొలిటికల్ సర్కిళ్లలో గట్టిగా నడుస్తోంది. సోషల్ మీడియా బిల్డప్‌లు, పెయిడ్ ప్రచారాల కంటే క్షేత్రస్థాయిలో ప్రజలతో ఉండే లైవ్ కనెక్టివిటీయే నాయకుడి అసలైన బలం అని హరీష్ రావు మరొకసారి నిరూపించారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత చాలామంది కీలక నేతలు వ్యూహాత్మక మౌనం దాల్చినా , సోషల్ మీడియా వేదికలకే పరిమితమైనా.. హరీష్ రావు మాత్రం రోడ్డెక్కి రైతు సమస్యలపై, ప్రభుత్వ వైఫల్యాలపై క్షేత్రస్థాయి పోరాటానికే ప్రాధాన్యత ఇస్తున్నారుఅయితే, హరీష్ రావు ఏం చేసినా సరే ఆయన చుట్టూ రకరకాల రాజకీయ ఊహాగానాలు, అంతర్గత సమీకరణల ప్రచారాలు ముసురుకోవడం పరిపాటిగా మారింది. ప్రజాక్షేత్రంలో ఆయన చురుగ్గా ఉంటూ భారీగా జనాన్ని సమీకరిస్తే.. పార్టీతో సంబంధం లేకుండా సొంత ఇమేజ్, పర్సనల్ బ్రాండ్ పెంచుకోవడానికి యత్నిస్తున్నారు అని సొంత పార్టీలోని కొందరు వ్యతిరేక వర్గీయులు ముద్రవేసే యత్నం చేస్తారు. అదే సమయానికి ఆయన కొద్దిరోజులు సైలెంట్‌గా ఉంటే.. పార్టీ నాయకత్వంపై అలిగారు, విముఖతతో ఉన్నారు అంటూ ప్రత్యర్థులు ప్రచారం మొదలుపెడతారు. ఈ రెండింటి మధ్య హరీష్ రావు సమన్వయం పాటిస్తూ, తన పని తాను



చేసుకుపోతుండటం ఆయన పరిణతికి నిదర్శనంహరీష్ రావు అంతర్గత వ్యూహాలు ఎప్పుడూ అంత సులభంగా బోధపడవు. ఒకవేళ హరీష్ రావు ఆలోచన ధోరణిలో చిన్నపాటి మార్పు వచ్చినా లేదా ఆయన వేరే రాజకీయ ఆలోచనల్లో ఉన్నారనే అనుమానం బీఆర్ఎస్ హైకమాండ్‌కు వస్తే.. అది కేవలం ఆ పార్టీలోనే కాక మొత్తం తెలంగాణ రాజకీయ యవనికపైనే ఒక భారీ పొలిటికల్ పెను భూకంపం సృష్టిస్తుందనడంలో సందేహం లేదు. గులాబీ దళంలో అత్యంత కేడర్ బేస్, మాస్ అప్పీల్ ఉన్న నేత కావడంతో.. ఆయన ప్రతి కదలికపై ప్రగతి భవన్ నుంచి ఫామ్‌హౌస్ వరకు, గజ్వేల్ నుంచి సిద్దిపేట వరకు నిరంతరం నిఘా మరియు చర్చ నడుస్తూనే ఉంటాయి. ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతుల్లో వ్యక్తమవుతున్న అసంతృప్తిని, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలను ఆయుధంగా మలుచుకోవడంలో హరీష్ రావు సక్సెస్ అవుతున్నారు. పార్టీ పదవుల హోదా కంటే, ప్రజల్లో తనకున్న అసలైన గ్రౌండ్ పవర్ ఏంటో నిరూపించుకోవడానికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారు. సిద్దిపేట పాదయాత్ర ద్వారా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వానికే కాదు, సొంత పార్టీలోని తన వ్యతిరేకులకు కూడా స్పష్టమైన సంకేతాలు పంపారని భావించవచ్చు. మాస్ లీడర్‌షిప్‌కు ప్రత్యామ్నాయం లేదని ఆయన క్షేత్రస్థాయి ఫలితాల ద్వారా చాటిచెబుతున్నారు.వూహాగానాలు, రాజకీయ విమర్శలను ఏమాత్రం పట్టించుకోకుండా హరీష్ రావు తన సొంత శైలిలోనే రైతు పోరాట బాట పట్టారు. రాబోయే రోజుల్లో ఈ పాదయాత్రలను ఇతర నియోజకవర్గాలకు విస్తరిస్తే, అది బీఆర్ఎస్ పార్టీకి ప్రధాన పునరుత్తేజంగా మారే అవకాశం ఉంది. అయితే, ఈ ప్రజాదరణను పార్టీ నాయకత్వం ఎలా స్వీకరిస్తుంది, హరీష్‌ను ఏ రకంగా ముందుకు నడిపిస్తుంది అనేదానిపైనే బీఆర్ఎస్ భవిష్యత్ రాజకీయ వ్యూహాలు , తెలంగాణ రాజకీయ సమీకరణలు ఆధారపడి ఉన్నాయి.

# సొంత పార్టీపై విమర్శలు

**హైదరాబాద్ :** బీజేపీకి ఆయన బద్ధుడైన నాయకుడే. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం అంటే ఆషామాషీ వ్యవహారం కానే కాదు. కానీ గెలిచి చూపించిన రాజకీయ మొనగాడు రాజాసింగ్. గోషామహల్ ఎమ్మెల్యేగా 2014 నుంచి వరుసగా బీజేపీ గుర్తుతో గెలిచి వస్తున్న రాజా సింగ్ ని పార్టీ 2023 ఎన్నికల తరువాత సస్పెండ్ చేసింది. ఆయన కొన్ని విషయాల్లో సొంత పార్టీ మీదనే విమర్శలు చస్తున్నారు అన్న కారణంతో పక్కన పెట్టారు. అయితే ఏదో నాటికి ఆయన బీజేపీ గూటికి చేరుతారు అన్న ప్రచారం ఒక వైపు ఉండగానే రాజా సింగ్ ఏ మాత్రం తగ్గడం లేదు. తన అభిప్రాయాలను ఆయన కుండబద్దలు కొడుతున్నారు. ఆయన బీజేపీకి నిర్మాణాత్మకమైన సూచనలు ఇస్తున్నట్లుగానే అవి ఉంటున్నా అదే సమయంలో ఘాటైన విమర్శలుగా కూడా కనిపిస్తున్నా యి బీజేపీ తెలంగాణాలో అధికారంలోకి వస్తుందా అని రాజా సింగ్ ప్రశ్నించారు. ఆ ఇద్దరు నేతలు కలిస్తే ఏమి జరుగుతుందని ఆయన కీలక ప్రశ్నను సంధించారు. ఆ ఇద్దరు నేతలు ఎవరో కాదు కేంద్ర మంత్రి బండి సంజయ్ అలాగే మల్కాజ్ గిరి ఎంపీ ఈటెల రాజేందర్. ఈ ఇద్దరు నాయకులను తెలంగాణా బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ సింగ్ పిలిపించి చేతులు కలిపారు. విభేదాలు మరచి కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. దీంతో బీజేపీ తెలంగాణాలో తన వ్యూహాత్మకమైన అడుగులతో ముందుకు సాగుతోంది అన్న సంకేతాన్ని ఇచ్చినట్లు అయింది. ఇపుడు దానిని రాజా సింగ్ తప్పు పడుతున్నారు. ఇద్దరు నేతలు చేతులు కలిపితే బీజేపీ అధికారంలోకి వస్తుందా అని ఆయన నిలదీస్తున్నారు బీజేపీలో ఎంతో మంది సీనియర్ నాయకులు అలాగే కార్యకర్తలు ఉన్నారని ఆయన గుర్తు చేశారు. వారి సంగతి ఏమిటి అని కూడా ప్రశ్నించారు. అంటే పార్టీలో నాయకులందరినీ బీజేపీ ఇంకా కలుపుకొని పోవడం లేదన్న విమర్శ ఆయన మాటలలో కనిపిస్తోంది. అదే సమయంలో కార్యకర్తలకు ఉత్సాహం కలిగించేలా యాక్షన్ ప్లాన్ లేదని



కూడా ఆయన చెబుతున్నట్లుగా ఉంది. నిజానికి బీజేపీలో ఇద్దరు కీలక నేతలు షేక్ హ్యాండ్స్ ఇచ్చుకున్నారు. విభేదాలు తగ్గాయి. ఇది మంచి సంకేతాలను ఇస్తుందని కమలనాధులు ఒక వైపు పొంగుతున్నారు. దాని మీద రాజా సింగ్ తన ఘాటు విమర్శలతో నీళ్ళు జల్లేశరు అని అంటున్నారు. .కమలం పార్టీ తెలంగాణాలో కదనోత్సాహంతో ఉంది. మూడు కార్పోరేషన్ల మేయర్ పదవులు గెలుచుకోవాలని పట్టుదలగా ఉంది. అలా తన సత్తా చాటాలని చూస్తోంది. అయితే బీజేపీ ఉత్సాహానికి గాలి తీసేశారు రాజాసింగ్ అంటున్నారు. మూడు కార్పోరేషన్ల మేయర్లు గెలవడం కాదు ముందు ఒక్క కార్పోరేషన్ లో అయినా సగం సీట్లు గెలిచి చూపించండి చాలు అని సవాల్ చేసేలా మాట్లాడారు. అంటే బీజేపీకి ఒక్క కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవని రాజా సింగ్ తన ముందస్తు అంచనాను ఇలా బయటపెట్టారా అని చర్చ సాగుతోంది. అంతే కాదు ఆయన బీజేపీ ప్రస్తుత అధ్యక్షుడు రామచంద్రరావు మీద మీద కూడా కామెంట్స్ చేశారు. ఆయన చేతులు కట్టేశారని మరి ఎలా పనిచేస్తారు అని ప్రశ్నించారు ఒక వ్యక్తి కోసమే అధినాయకత్వం ఆలోచించే విధానాలు వద్దు అని హితవు పలికారు. మొత్తానికి దూరంగా ఉంటూనే కమలానికి కఠినమైన తీరులోనే సలహాలు సూచనలతో పాటు దిశా నిర్దేశం చేశారు రాజాసింగ్. దీనిని బీజేపీ అధినాయకత్వం ఏ విధంగా చూస్తుంది అన్నదే ఇపుడు చర్చ మరి.

# తెలంగాణలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయన్న పొన్నం

**హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావం కారణంగా తెలంగాణ వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణంలో తలెత్తిన ఈ మార్పుల దృష్ట్యా ప్రజలకు, రైతులకు నీటి ఎద్దడి రాకుండా అధికారులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ఐఓసీ కార్యాలయంలో ఎల్‌నినో ప్రభావం, తాగునీటి పరిస్థితులపై మంత్రి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లతో పాటు హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు హాజరయ్యారు.సమీక్ష సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో తాగునీటి కొరతతో పాటు పశువులకు గ్రాసం లభించక ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు ఉన్నాయని అధికారులను హెచ్చరించారు. రాబోయే జూన్ నెల వరకు వర్షాలు పడే అవకాశం తక్కువగా ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారని వెల్లడించారు. ఈ కరవు పరిస్థితులను తట్టుకోవాలంటే రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటలు వేసేలా అధికారులు వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు.మరోవైపు రాష్ట్రంలో రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలమట్టాలను మళ్లీ పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందడుగు వేయాలని పొన్నం తెలిపారు. 'వీబీజీ రాంజీ' ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకుని ప్రతి ఊరిలో పెద్ద ఎత్తున ఇంకుడు గుంతల తవ్వకాలు చేపట్టాలని, పడిన ప్రతి వర్షపు బొట్టునూ వృథా కాకుండా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అధికారులు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళుతూ నిరంతరం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

వరి సాగు తగ్గించి, ప్రత్యామ్నాయ పంటలు వేయాలని రైతులకు సూచన

ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది తెలంగాణలో వర్షపాతం గణనీయంగా తగ్గడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వర్షపాతం, భూగర్భ జలాల లభ్యత, అందుబాటులో ఉన్న సాగునీటి వనరులను నిరంతరం విశ్లేషిస్తూ, పంటల సరళిలో మార్పుల కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తోంది.

# రణ్‌వీర్ సింగ్ 'ప్రళయ్'లో దక్షిణాది బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్

## కొత్త జోడీపై పెరిగిన ఆసక్తి



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ప్రళయ్'పై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. యాక్షన్, ఎమోషన్స్ కలగలిపిన కథతో రూపొందుతున్న ఈ సినిమా గురించి వస్తున్న తాజా వార్త ఇప్పుడు మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా దక్షిణాది నటి కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పటికే తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. సహజమైన నటన, అందంతో యువతలో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పరచుకున్న ఆమెకు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ అవకాశం దక్కబోతుందనే వార్త చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్ వంటి స్టార్ హీరో సరసన నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. అలాంటి హీరోతో కళ్యాణి జోడీ కట్టడం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాది ప్రేక్షకుల్లో కూడా ఈ కాంబినేషన్‌పై చర్చ మొదలైంది. 'ప్రళయ్' చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. యాక్షన్ సీక్వెన్సులతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చే కథగా రూపొందుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో సినిమాను రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికపై అధికారిక ప్రకటన రాకపోయినా, త్వరలోనే చిత్రబృందం పూర్తి తారాగణాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. తదుపరి షూటింగ్ షెడ్యూల్ కూడా త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి రణ్‌వీర్ సింగ్ -- కళ్యాణి ప్రియదర్శన్ కాంబినేషన్ నిజమైతే, ఇది దక్షిణాది -- బాలీవుడ్ కలయికలో మరో ఆసక్తికర జోడీగా నిలిచే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కొత్త జంట వెండితెరపై ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలంటే అధికారిక ప్రకటనతో పాటు సినిమా విడుదల వరకు వేచి చూడాల్సిందే.

# జబర్ధస్త్ బ్యూటీకి బిగ్ బాస్ ఆఫర్.. ఆమె స్పందన ఏంటి?




జబర్దస్త్ కామెడీ షో ద్వారా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి సత్యశ్రీ ప్రస్తుతం సినిమాల్లో వరుస అవకాశాలతో బిజీగా ఉన్నారు. టెలివిజన్‌కు దూరంగా ఉంటూ వెండితెరపై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ఆమె, తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం, కెరీర్ ఎంపికలు, అలాగే బిగ్‌బాస్ ఆఫర్‌ను ఎందుకు తిరస్కరించారనే విషయంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జబర్దస్త్ తర్వాత సినిమాల్లో మంచి అవకాశాలు రావడంతో టెలివిజన్‌లో తక్కువగా కనిపిస్తున్నానని సత్యశ్రీ తెలిపారు. కెరీర్ ప్రారంభంలో వచ్చిన ప్రతి అవకాశాన్ని స్వీకరించినప్పటికీ, ఇప్పుడు మాత్రం పాత్రల ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నానని చెప్పారు. ఇప్పుడు నేను ఉన్న దశలో నా ఇమేజ్, రెప్యుటేషన్‌ను దృష్టిలో పెట్టుకుని పాత్రలు ఎంచుకుంటున్నాను. గ్లామర్ ఉన్నంతవరకు మంచి అవకాశాలను సెలెక్టివ్‌గా చేయాలనుకుంటున్నాను అని ఆమె పేర్కొన్నారు. ఇటీవల విడుదలైన 'అనగనగా ఒక రాజు' చిత్రంలో నటించిన సత్యశ్రీ, హీరో నవీన్ పొలిశెట్టి గురించి కూడా ఆసక్తికర విషయాలు వెల్లడించారు. సెట్స్‌లో నవీన్ ఎప్పుడూ పనిపైనే దృష్టి పెట్టే వ్యక్తి అని, ప్రతి క్షణం సినిమా గురించే ఆలోచిస్తుంటారని చెప్పారు. నవీన్ గారితో మాట్లాడింది చాలా తక్కువ. కానీ ఆయన పని చేసే విధానాన్ని దగ్గరగా చూసే అవకాశం వచ్చింది. 'జాతిరత్నాలు' సమయంలోనే మరో సినిమాలో కలిసి పని చేద్దామని ఆయన చెప్పారు. ఆ మాటను నిలబెట్టుకుని 'అనగనగా ఒక రాజు'లో అవకాశం ఇవ్వడం నాకు చాలా ఆనందంగా అనిపించింది" అని సత్యశ్రీ తెలిపారు. ఇటీవల బిగ్‌బాస్ తెలుగు సీజన్-10 కోసం సత్యశ్రీకి ఆఫర్ వచ్చిందనే వార్తలపై కూడా ఆమె స్పందించారు. ఆ వార్తల్లో నిజం ఉందని, కానీ కుటుంబ పరిస్థితుల కారణంగా ఆ అవకాశాన్ని వదులుకోవాల్సి వచ్చిందని వెల్లడించారు.నాకు బిగ్‌బాస్ నుంచి ఆఫర్ వచ్చింది. కానీ నేను మా కుటుంబ బాధ్యతలను చూసుకుంటున్నాను. అమ్మానాన్నలను అంతకాలం వదిలి వెళ్లడం నాకు సాధ్యం కాదు. వారికి తోడుగా ఉండాల్సిన బాధ్యత నాదే. అందుకే ఆ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించాను అని ఆమె చెప్పారు. ప్రతి ఒక్కరికీ కుటుంబం ఉంటుందని, కానీ చాలామందికి వారి బాధ్యతలు పంచుకునే వారు ఉంటారని, తన పరిస్థితి మాత్రం భిన్నమని సత్యశ్రీ వివరించారు. అందుకే కెరీర్ కంటే కుటుంబానికే ప్రాధాన్యం ఇచ్చానని స్పష్టం చేశారు.




# క్రేజీ టాక్.. నందమూరి హీరోను లైన్‌లో పెట్టిన పరశురాం!

సోలో, గీత గోవిందం, సర్కారు వారి పాట ఫ్యామిలీ ఆడియెన్స్‌లో సూపర్ క్రేజ్ సంపాదించుకున్నాడు టాలీవుడ్ డైరెక్టర్ పరశురాం. ఈ క్రేజీ డైరెక్టర్ 2024లో వచ్చిన ది ఫ్యామిలీ స్టార్ సినిమా తర్వాత కొత్త ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. ఇప్పుడు పరశురాం కొత్త సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి ఫిలింనగర్ సర్కిల్‌లో రౌండప్ చేస్తోంది. ఈ సారి నందమూరి హీరోతో సినిమా చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడన్న న్యూస్ ఒకటి తెరపైకి వచ్చింది. ఇంతకీ ఎవరా హీరో అనే కదా మీ డౌటు.. పటాస్ హీరో నందమూరి కల్యాణ్ రామ్. తాజా టాక్ ప్రకారం పరశురాం ఇప్పటికే కల్యాణ్ రామ్‌కు ఓ ఐడియాను చెప్పాడట. కల్యాణ్ రామ్‌కు పరశురాం చెప్పిన బేసిక్ ఐడియా నచ్చిందట. ఈ క్రమంలో పరశురాం పూర్తి స్థాయిలో స్క్రిప్ట్‌ను సిద్ధం చేసే పనిలో ఉన్నాడని ఇన్‌సైడ్ టాక్. ప్రస్తుతం కల్యాణ్ రామ్ అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్న మల్టీ స్టారర్‌తో బిజీగా ఉన్నాడు. వెంకటేశ్, కల్యాణ్ రామ్ లీడ్ రోల్స్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రం షూటింగ్ దశలో ఉంది. అన్నీ అనుకున్నట్టుగా కుదిరతే ఈ మూవీ పూర్తయిన తర్వాత కల్యాణ్ రామ్, పరశురాం సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశమున్నట్టు సమాచారం. క్లాస్, మాస్ టచ్‌తో మంచి సందేశాన్ని జోడిస్తూ.. ఎంటర్‌టైన్ చేసే ప్రయత్నం చేయడంలో ఎప్పుడూ ముందుంటాడు పరశు రాం. మరి ఈ సారి కల్యాణ్ రామ్‌తో ఎలాంటి సబ్జెక్టును రెడీ చేశాడనేది ఆసక్తి నెలకొంది. దీనిపై రాబోయే రోజుల్లో కొత్త అప్‌డేట్ వస్తుందేమో చూడాలి.



# 'టాక్సిక్'పై నిర్మాత ఆసక్తికర వ్యాఖ్యలు.. ఇది పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక చిత్రం

కేజీఎఫ్ సిరీస్‌తో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాక్ స్టార్ యశ్ నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' ఇప్పటికే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇటీవల విడుదలైన టీజర్, ప్రోమో వీడియోలు, పాటల్లో కనిపించిన బోల్డ్ కంటెంట్ సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో చిత్ర నిర్మాత కె. వెంకట నారాయణ తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. టాక్సిక్ సాధారణ కమర్షియల్ సినిమా కాదని, తాము ఇప్పటివరకు నిర్మించిన చిత్రాల కంటే పూర్తిగా భిన్నమైన కథాంశంతో రూపొందించామని ఆయన తెలిపారు. ప్రేక్షకులు థియేటర్లలో ఈ సినిమాను చూసిన తర్వాత తప్పకుండా కొత్త అనుభూతిని పొందుతారని, సినిమా ముగిసిన తర్వాత చిత్ర బృందాన్ని అభినందిస్తారనే పూర్తి నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా, 'టాక్సిక్' ఒక కల్పిత కథ ఆధారంగా రూపొందిన సినిమా అని, ముఖ్యంగా పెద్దల కోసం రూపొందించిన ప్రత్యేక కథనమని ఆయన స్పష్టం చేశారు. సినిమా టైటిల్‌కు తగ్గట్టుగానే ఇందులో భావోద్వేగాలు, యాక్షన్, రొమాన్స్ ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలు ఉంటాయని సంకేతాలు ఇచ్చారు. ఇదిలా ఉంటే, ఇటీవల విడుదలైన 'మనసాగదే' పాటకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. యశ్, తారా సుతారియా మధ్య సాగే ఈ రొమాంటిక్ ట్రాక్ సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో నిలిచింది. ముఖ్యంగా పాటలోని విజువల్స్, సంగీతం, ఇద్దరి కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.ఈ పాటపై హీరోయిన్ తారా సుతారియా కూడా స్పందించారు. పాటలోని కొన్ని సన్నివేశాలను ఎంతో అందంగా చిత్రీకరించారని, చిత్రబృందం విజువల్‌గా అద్భుతమైన అనుభూతిని అందించిందని ఆమె సోషల్ మీడియా ద్వారా పేర్కొన్నారు. దీంతో ఈ పాటకు మరింత క్రేజ్ ఏర్పడింది. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా పలు భాషల్లో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713